PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 31-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 271 Issue: 271

Published from Jagitial
Circulated to Telangana

31 మార్చి 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:15 సూర్యాస్తమయం - సా. 6:25 తిథి త్రయోదశి ఉ. 6:56 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) మ. 3:19 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం గండ మ. 3:40 వరకు కరణం తైతుల ఉ. 6:56 వరకు గరజి రా. 7:01 వరకు వర్జ్యం రా. 10:49 నుండి రా. 12:29 వరకు దుర్ముహూర్తం ఉ. 8:41 నుండి ఉ. 9:29 వరకు రా. 11:09 నుండి రా. 11:56 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:54 వరకు యమగండం ఉ. 9:17 నుండి ఉ. 10:49 వరకు గుళికాకాలం మ. 12:20 నుండి మ. 1:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:39 నుండి తె. 5:27 వరకు అమృత ఘడియలు ఉ. 8:46 నుండి ఉ. 10:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:44 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## చైనా సీసీ కెమెరాలు బ్యాన్

న్యూఢిల్లీ: చైనా సీసీటీవీ కెమెరాలు నిషేధిస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. వాటి అమ్మకాలను నిలిపివేసింది. భద్రతా కారణాల దృష్ట్యా సీసీటీవీ కెమెరాల విక్రయంపై కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఈ నియమాల ప్రకారం చైనా కంపెనీలు భారత్‌లో ధ్రువీకరణ లేకుండా తమ ప్రొడక్ట్స్‌ను విక్రయించకూడదు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చైనా కంపెనీలు తయారుచేసిన ఇంటర్నెట్ అనుసంధానిత సీసీటీవీ కెమెరాలపై ప్రభుత్వం నిషేధం తరువాయి 2 వ పేజీలో...



## సైబర్ దొంగలపై డిజిటల్ స్ట్రైక్

దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాలు, ముఖ్యంగా డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ భారీ డిజిటల్ స్ట్రైక్ చేపట్టింది.

న్యూఢిల్లీ: ఈ ఉక్కు చర్యల్లో భాగంగా 2025 ప్రారంభం నుండి ఇప్పటివరకు మోసాలకు పాల్పడుతున్న 83,867 వాట్సాప్ ఖాతాలను, 3,962 -2 వ పేజీలో...

## సిమ్ బైండింగ్ గడువు పెంపు?



న్యూఢిల్లీ: వాట్సాప్, టెలిగ్రామ్, అరట్టై వంటి మెసేజింగ్ యాప్స్ ఉపయోగిస్తున్న వారికి ఊరట లభించింది. ఈ మెసేజింగ్ యాప్స్‌కు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనల అమలు వాయిదా పడనున్నట్లు సమాచారం. సిమ్ బైండింగ్ రూల్స్ అమలు కోసం ఇచ్చిన గడువును పొడిగించాలని కేంద్రం భావిస్తోంది. ఆయా టెక్ కంపెనీల నుంచి వచ్చిన వినతుల -2 వ పేజీలో...

# గడ్డి మందు బ్యాన్!




## పారాక్వాట్‌ను నిషేధిస్తూ అసెంబ్లీ తీర్మానం

## స్వాగతించిన రైతులు, ప్రజాప్రతినిధులు




రైతుల పాలిట ప్రాణాంతకంగా మారిన 'పారాక్వాట్' గడ్డి మందును తెలంగాణ ప్రభుత్వం నిషేధించింది. బీఆర్ఎస్ బోయినపల్లి వినోద్ కుమార్, ఇటీవల సినీ నటుడు రాహుల్ రామకృష్ణ పారాక్వాట్ దుష్పరిణామాలపై గళమెత్తిన నేపథ్యంలో.. రైతుల ప్రాణాలు బలిగొంటున్న ఈ గడ్డిమందును నిషేధిస్తూ సోమవారం అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సర్కార్ తీర్మానం చేసింది. తద్వారా ఈ హానికర రసాయనం నుంచి రాష్ట్రంలోని రైతాంగానికి ఉపశమనం లభించనుంది.

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): పలు దుష్పరిణామాలతో ప్రాణాంతకంగా మారిన పారాక్వాట్ గడ్డి మందు నిషేధాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. ఈ మందును నిషేధించాలని గత రెండు నెలలుగామాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్ కుమార్ పోరాడారు. హానికరమైన ఈ గడ్డి మందు వల్ల తలెత్తుతున్న దుష్పరిణామాలు, వందల సంఖ్యలో ప్రజలు, యువతి, యువకులు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వినోద్ కుమార్ గళమెత్తారు. పారాక్వాట్‌ను తక్షణమే నిషేధించాలని ఆయన పలు పత్రికల్లో వ్యాసాలతో తరువాయి 2 వ పేజీలో...

# పెట్రోల్ బంకుల్లో గ్యాస్ నూనె!

## ఎల్పీజీ కొరత వేళ కేంద్రం నిర్ణయం

## అమ్మకాలపై పలు నిబంధనలు జారీ



దేశవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను అధిగమించేందుకు మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా ఇరాన్ వివాదం నేపథ్యంలో ముడి చమురు, ఇంధన సరఫరాలు దెబ్బతినడంతో.. సామాన్యులకు ఉపశమనం కలిగించేలా కిరోసిన్ నిబంధనలను సడలిస్తూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

న్యూఢిల్లీ: గృహ అవసరాలకు, దీపాల కోసం కిరోసిన్ పంపిణీని వేగవంతం చేసేందుకు పెట్రోలియం భద్రత, లైసెన్సింగ్ నిబంధనల్లో కేంద్రం తాత్కాలిక మార్పులు చేసింది. గతంలో కిరోసిన్ రహిత రాష్ట్రాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు దాని సరఫరాను ప్రభుత్వం పునరుద్ధరించింది. ఢిల్లీ, హర్యానా , ఉత్తర ప్రదేశ్, గుజరాత్ సహా మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సుపీరియర్ కిరోసిన్ ఆయిల్ (ఎస్‌కేఓ) అందుబాటులోకి రానుంది. నిబంధనలు సడలించినప్పటికీ భద్రత విషయంలో కేంద్రం కఠినంగా ఉన్నట్లు తరువాయి 2 వ పేజీలో...



## విజయ్ ఆస్తులు 520 కోట్లు

### ఎన్నికల అఫిడవిట్‌లో ఆసక్తికర విషయాలు

తమిళనాడులో ఎన్నికల వేళ తమిళ వెట్రి కళగం పార్టీ చీఫ్, ప్రముఖ నటుడు తలపతి విజయ్ తన ఆస్తుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత తొలిసారిగా ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

చెన్నై: ఈ అఫిడవిట్ ప్రకారం విజయ్ మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 520 కోట్లుగా ఉంది. అయితే, విజయ్ తన అఫిడవిట్‌లో చర, స్థిరాస్తుల వివరాలను విడివిడిగా పొందుపరిచారు. సుమారు రూ.405 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో నగదు, బ్యాంక్ డిపాజిట్లు, విలువైన వాహనాలు, ఇతర పెటుబడులు ఉన్నాయి. ఇక సుమారు రూ.115 కోట్ల విలువైన స్థిరాస్తులు ఇళ్లు, భవనాలు, భూములు ఉన్నట్లు వెల్లడించారు. తన భార్య సంగీత పేరిట ఉన్న బ్యాంకు డిపాజిట్ల వివరాలను కూడా విజయ్ ఈ అఫిడవిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆమె పేరిట ఇండియన్ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.14,8ు26 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,671 |



## కేసీఆర్ హౌస్ అరెస్ట్!

### కేటీఆర్, హరీశ్ గృహనిర్బంధం చేశారు

హరీశ్ కాలనాగు కంటే ప్రమాదం.. కేసీఆర్ లేకపోతే నేను లేను: సీఎం

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహాభారతంలో శకుడు లేకపోతే కృష్ణుడు లేడు.. కేసీఆర్ లేకపోతే నేను లేను.. కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు వచ్చింది' అని తెలిపారు. సోమవారం మీడియాతో -2 వ పేజీలో...



## పొంగులేటి కబ్జా రాయుడు

### రూ.1400 కోట్ల భూమిపై కన్ను.. నిషేధిత జాబితాలో కోటి ఎకరాల భూమి

రైతుల భూములను గుంజుకొనే కుట్రలు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ధ్వజం

రంగారెడ్డి, మార్చి 30 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వట్టినాగులపల్లిలో సతీశ్ షా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చెక్ రిపబ్లిక్‌లో బీవర్లు (నీటిలో జీవించే జీవి) ఆనకట్టలు కట్టి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. మురుగు నీటితో నిండిన ప్రాంతాన్ని చెక్క కొమ్మలు, మట్టి, రాళ్లతో నీటి ప్రవాహాన్ని అడ్డుకొనేలా బలమైన ఆనకట్టలు నిర్మించాయి. దాంతో మురుగు నీరు శుద్ధి అయ్యి అవతలి వైపు మంచి నీరు మారింది. ఈ ఆనకట్టల ద్వారా అక్కడి ప్రభుత్వానికి 1.2 మిలియన్ డాలర్లు ఆదా అయ్యాయి.




## దొంగలెత్తుకుపోయారు!

రూ.1.5 కోట్ల కిట్‌క్యాట్ చాక్లెట్ల కంటెయినర్ చోరీ.. సినిమాను తలపించేలా హైటెక్ దొంగతనం

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కిట్‌క్యాట్ చాక్లెట్ తయారీ సంస్థ నెస్లేకు దొంగలు భారీ షాక్ ఇచ్చారు. ఇటలీ నుంచి పోలాండ్‌కు తరలిస్తున్న సుమారు రూ. 1.5 కోట్ల విలువైన చాక్లెట్ల షిప్‌మెంట్‌ను అత్యంత చాకచక్యంగా హైజాక్ చేశారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నెస్లే, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహాయం కోరింది.

రోమ్: ఈ చోరీ జరిగిన తీరు ఓ సినిమా స్క్రీన్‌ప్లేను తలపిస్తోంది. దొంగలు నకిలీ రవాణా పత్రాలు, ఫేక్ ఐడెంటిటీ కార్డులను సృష్టించారు. అసలైన డ్రైవర్ యూనిట్‌కు చేరుకోక ముందే, పక్కా ప్రణాళికతో వీరు ఫ్యాక్టరీకి చేరుకున్నారు. అక్కడి లోడింగ్ సిబ్బందిని మాటలతో నమ్మించి, కిట్‌క్యాట్ చాక్లెట్లతో నిండిన భారీ ట్రక్కును తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. ఇటలీ సరిహద్దు దాటిన కొద్దిసేపటికే ట్రక్కు తరువాయి 2 వ పేజీలో...

## 'ట్రంప్' కార్డు తుపేల్!

### పారని అమెరికా అధ్యక్షుడి చిత్తులు

జిత్తులు పనిచేయవంటున్న ఇరాన్.. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై చీదరింపు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ చుక్కలు చూపిస్తోంది. పశ్చిమాసియా యుద్ధంలో ఆ దేశం ఎంతకీ తగ్గకపోవడంతో ట్రంప్‌కు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దూకుడుగా వెళ్దామంటే ఇరాన్ నుంచి ఏ ముప్పు వస్తుందోననే భయం నెలకొంది. దీంతో ఏం పాలుపోక కొన్ని రోజుల పాటు యుద్ధానికి గ్యాప్ ఇచ్చారు. అదే సమయంలో ఇరాన్‌కు వార్నింగ్‌ల మీద వార్నింగ్‌లు ఇస్తూనే మధ్యవర్తిత్వాన్ని నెరుపుతున్నారు. ఇందుకు ట్రంప్.. పాకిస్థాన్ను మధ్యలో పెట్టుకున్నారు.

టెహ్రాన్: ఇరాన్ మాత్రం వీటికి ససేమేరా అంటోంది. యుద్ధానికి ఘనమైన ముగింపు ఏంటో తామే ఇస్తామని, ఇటువంటి అర్థం పర్థం లేని మధ్యవర్తిత్వాలు వద్దనే అంటోంది. మధ్యవర్తిగా తమ పాత్ర పట్ల అమెరికా, ఇరాన్‌లు రెండూ సంతృప్తిగా ఉన్నాయని పాకిస్థాన్ చెప్పిన రోజుల వ్యవధిలోనే, ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆ వాదనలను తోసిపుచ్చింది. మధ్యవర్తి ద్వారా తమకు అసమంజసమైన డిమాండ్లు మాత్రమే అందాయని పేర్కొంది. అమెరికా తమతో నేరుగా చర్చలు జరపలేదని, మధ్యవర్తిత్వాల -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

31.3.2026

మేషం: నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సోదరులతో దీర్ఘకాలికంగా వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: మిత్రుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తవుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

మిధునం: ఇంటాబయటా ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన విశ్రాంతి లభించదు. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి.

కర్కాటకం: కీలక వ్యవహారాలలో ఆప్తులతో మాట పట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులులో శ్రమాధిక్యత పెరుగుతుంది. వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన వచ్చిన అవకాశాలు చేజారుతాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. అవసరానికి చేతికి డబ్బుఅందుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రులతో చర్చలు చేస్తారు. వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆప్తులనుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి.

తుల: చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. కుటుంబ సభ్యులతో దూరప్రయాణాలు చేస్తారు. ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో ధన నష్టాలుంటాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.


వృశ్చికం: వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమౌతారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఆస్తి వ్యవహారాలలో వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో తెలివిగా సమస్యల నుండి బయటపడతారు.

మకరం: కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. ఆకస్మిక ధనవ్యయ సూచనలున్నవి. వ్యాపారాలు మరింత మందగిస్తాయి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఋణప్రయత్నాలు కలసిరావు.

కుంభం: నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. ఇంటా బయట కీలక నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. పాత సంఘటనలు గుర్తు చేసుకుని బాధపడతారు. ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. వ్యాపారాలలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. సన్నిహితుల నుండి ఒక ముఖ్యమైన వ్యవహారంలో కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం అందదు. సంతాన విద్యా ఫలితాలు అంతంత మాత్రంగా ఉంటాయి.



# చైనా సీసీ కెమెరాలు బ్యాన్

మొదటి పేజీ తరువాయి

విధించింది. నిఘా గురించి ఆందోళనలు, జాతీయ భద్రత, డేటా సెక్యూరిటీ, సున్నితమైన మౌలిక సదుపాయాలపై నిఘా గురించి ఆందోళన క్రమంలో కేంద్రం ఈ చర్య తీసుకుంది. ఇక నుంచి భారత్‌లో సీసీటీవీ కెమెరాలు లేదా ఇతర సెక్యూరిటీ కెమెరాలను విక్రయించాలంటే కఠినమైన నిబంధనలు ఉంటాయి. ప్రభుత్వ ధ్రువీకరణ ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయంతో హిక్ విజన్, దహువా, టీపీ లింక్ వంటి చైనా కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఎయిర్‌పోర్ట్‌లు, ప్రభుత్వ ఆఫీసులు, రైల్వే స్టేషన్లు, ఇతర సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను పర్యవేక్షించేందుకు సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. అయితే చైనా ప్రొడక్ట్స్ వల్ల డేటా చోరీ, నిఘా ఉల్లంఘనలతో పాటు భద్రతకు ముప్పు కలిగిస్తాయనే ఆందోళనల సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇక నుంచి చైనా పరికరాలపై నిషేధం అమల్లోకి వచ్చింది. జాతీయ భద్రతా వ్యవస్థలు కేవలం విశ్వసనీయమైన నెట్‌వర్క్‌లపై మాత్రమే ఆధారపడాలని ప్రభుత్వం తెలిపింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఏప్రిల్ 2024లో కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ రూల్స్ ప్రకారం స్టాండర్డైజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్ విధానం అమలు చేస్తోంది. దీని ద్వారా కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రభుత్వం దగ్గర ధ్రువీకరించుకోవడానికి రెండేళ్ల సమయం కల్పిస్తారు. తమ ఉత్పత్తులు, సిస్టమ్ ఆన్ చిప్ వంటి కీలక భాగాల గురించి ప్రభుత్వానికి సమాచారం అందించాలి. ప్రభుత్వం గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో హ్యాకింగ్, డేటా లీక్, రిమోట్ యాక్సెస్ వంటి లోపాల గురించి టెస్టింగ్ చేయాలి. ఇప్పటివరకు 500కిపైగా సీసీటీవీ మోడళ్లకు ఆమోదం ఇచ్చారు. అయితే విదేశీ కంపెనీలు ఈ ప్రమాణాలను అందుకోవడంలో కాస్త వెనక పడ్డాయి.

# పొంగులేటి కబ్జా రాయుడు

మొదటి పేజీ తరువాయి

కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీ గల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్‌ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. నిజాం కాలం నాటి భూములను కూడా ఈ జాబితాలోకి చేర్చి, రైతులను భయాందోళనలకు గురిచేసి, భూములు గుంజుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, భూ కుంభకోణాలపై కేవలం సీబీసీఐడీ విచారణ సరిపోదని, వెంటనే సభా సంఘాన్ని (హౌస్ కమిటీ) వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని, పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ విచారణ పేరుతో మంత్రిని కాపాడే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఇదే సమయంలో పోలీసులకు కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. “పాలకుల ఒత్తిడికి లొంగి అక్రమాలకు సహకరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు” అని హెచ్చరించారు. అక్రమాలకు అండగా నిలవవద్దని, ప్రజల పక్షాన ఉండాలని పోలీసులను కోరారు. బాధితుల పేర్లు బయటపెట్టకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గడ్డి మందు బ్యాన్!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ గడ్డి మందును నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వినోద్ కుమార్ స్వాగతించారు. ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా రాహుల్ రామకృష్ణ చేసిన ట్వీట్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

## విరుగుడు లేని విషం

పారాక్వాట్ కేవలం కలుపు మొక్కలనే కాదు, మనుషుల ప్రాణాలను కూడా నిలువునా తీస్తోంది. ఈ మందు శరీరంలోకి ప్రవేశిస్తే, దానికి ఇప్పటివరకు ఎలాంటి విరుగుడు లేదు. కేవలం ఒక స్పూన్ మోతాదులో తీసుకున్నా ప్రాణాలు దక్కడం దాదాపు అసాధ్యం. ఇది తాగిన వారిలో ఊపిరితిత్తులు గట్టిపడిపోవడం, కిడ్నీలు, కాలేయం దెబ్బతినడం వంటివి సంభవిస్తాయి. శ్వాస తీసుకోవడం భారమై బాధితులు నరకయాతన అనుభవిస్తూ చనిపోతారు. పిచికారీ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం కాలడం, గోర్లు రాలిపోవడం, చూపు మందగించడం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీర్ఘకాలికంగా ఇది పార్కిన్సన్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూసారాన్ని తగ్గించడమే కాకుండా, భూగర్భ జలాలను సైతం ఇది విషతుల్యం చేస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ తీర్మానం ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైనది. రాష్ట్రంలో ఏటా దాదాపు 2,000 నుండి 5,000 మంది పారాక్వాట్ వల్ల మరణిస్తున్నారని అంచనా. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు ఇది ఒక మరణాయుధంగా మారింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాలు దీనిపై నిషేధం విధించాయి. మన దేశంలోనూ కేరళ, ఒడిశా, పంజాబ్ వంటి రాష్ట్రాలు దీని వినియోగాన్ని నియంత్రించాయి. కేవలం తీర్మానాలకు పరిమితం కాకుండా, ఈ మందు తయారీ, విక్రయం మరియు నిల్వపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే సంపూర్ణ నిషేధం విధించాల్సిన అవసరం ఉంది. రైతులకు ప్రత్యామ్నాయ, సురక్షితమైన కలుపు నివారణ పద్ధతులపై అవగాహన కల్పించాలి. మానవ ప్రాణాల కంటే ఏ జరసాయనమూ ముఖ్యం కాదు.

# ‘ట్రంప్’ కార్డు తుపేల్!

మొదటి పేజీ తరువాయి

ద్వారా యుద్ధం ముగింపు అనేది ఉండబోదని తేల్చిచెప్పింది. ఒకవేళ అమెరికా తమతో తాము పెట్టే కండీషన్స్‌కు డైరెక్ట్‌గా మాట్లాడి ఒప్పుకుంటేనే అప్పుడు యుద్ధం ముగింపు ఆలోచిస్తామని స్పష్టం చేసింది. తమకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం అనేది వద్దే వద్దని, దానివల్ల పెద్దగా ఉపయోగం ఉండదని అంటోంది. పాక్ అనేది అమెరికా వదిలిన అస్త్రమనే విషయమని ఇరాన్‌కు అర్థమైంది. ఇన్ని ప్రపంచదేశాలు ఉండగా పాకిస్థాన్‌ను మధ్యవర్తిగా అమెరికా పెట్టుకోవడంపై ఇరాన్ ఆగ్రహంగా ఉంది. తమకు ఏదో రకంగా నష్టం కల్గించాలనే యోచనతోనే పాకిస్థాన్‌ను అమెరికా వాడుకుంటుందని, ఆ పావులో తాము పడకూడదనే భావన ఇరాన్‌లో స్పష్టంగా కనబడుతోంది. మాట్లాడితే మీరు డైరెక్ట్‌గా మాట్లాడండి.. ఇలా మధ్యవర్తిత్వం, అందులోనూ పాకిస్థాన్ మధ్యవర్తిత్వం అంటే సహించలేకపోతోంది ఇరాన్. యుద్ధం ముగింపు విషయం తమ వైఖరి స్పష్టంగా ఉందని, దౌత్యం విషయంలో అమెరికా తరచు మాటమారుస్తుందని ఇరాన్ అంటోంది. ఒకవేళ తమ మధ్యవర్తిత్వం అనేది చేస్తే అమెరికా తలతూగే ఏ పెద్ద దేశమో చేయాలి కానీ ఇలా పాకిస్థాన్‌ను మధ్యలో తీసుకురావడం ఏంటనేది ఇరాన్ ప్రశ్నగా ఉంది. అందుకే యుద్ధం విషయంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపింది. దీంతో ఏం చేయాలో పాలుపోక ట్రంప్ దిక్కులు చూస్తున్నారు.

# సైబర్ దొంగలపై డిజిటల్ స్ట్రైక్

మొదటి పేజీ తరువాయి

స్కైప్ ఐడీలను అధికారులు బ్లాక్ చేశారు. టెలికమ్యూనికేషన్ల శాఖ (డాట్), పోలీసు యంత్రాంగం మరియు టెలికాం సంస్థల సమన్వయంతో సాగిన ఈ ఆపరేషన్‌లో భాగంగా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా గుర్తించిన 8.45 లక్షల సిమ్ కార్డులను, 2.39 లక్షల మొబైల్ ఐఎంఈఐ నంబర్లను నిలిపివేశారు. వీటితో పాటు 827 హానికరమైన మొబైల్ యాప్‌లను నిరోధించడమే కాకుండా, సహ్యోగ్ పోర్టల్ ద్వారా 1.11 లక్షలకు పైగా అనుమానాస్పద ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించారు. సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌ను మరియు వారి డిజిటల్ మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం ద్వారా పౌరుల ను ఆర్థిక, మానసిక దోపిడీల నుండి రక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రియల్-టైమ్ యంత్రాంగాన్ని అమలు చేస్తోంది.

# పెట్రోల్ బంకుల్లో గ్యాస్ నూనె!

మొదటి పేజీ తరువాయి

చెప్పింది. ‘పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) జారీ చేసిన భద్రతా ప్రోటోకాల్‌లు యథావిధిగా వర్తిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సూచించిన నిర్దేశిత అవుట్‌లెట్ల ద్వారా మాత్రమే పంపిణీ చేస్తారు. ఈ కిరోసిన్‌ను వంట, దీపాల వంటి గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలి’ అని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

## కొత్త నిబంధనల ముఖ్యాంశాలు

- ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (ఓఎంసీ) నిర్వహించే ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల ద్వారా కిరోసిన్ విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- ప్రభుత్వం గుర్తించిన ప్రతి అవుట్‌లెట్‌లో గరిష్టంగా 5,000 లీటర్ల కిరోసిన్ నిల్వ చేసుకోవచ్చు.
- ప్రతి జిల్లాకు గరిష్టంగా రెండు సర్వీస్ స్టేషన్లకు మాత్రమే ఈ అనుమతి ఉంటుంది.
- పెట్రోలియం రూల్స్, 2002 ప్రకారం డీలర్లు, రవాణా వాహనాలకు కొన్ని కఠినమైన లైసెన్సింగ్ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.
- ఈ సడలింపులు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇవి 60 రోజుల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు అమల్లో ఉంటాయి.

# విజయ్ ఆస్తులు 520 కోట్లు

మొదటి పేజీ తరువాయి

బ్యాంక్‌లో రూ.25 కోట్లు, యాక్సిస్ బ్యాంక్‌లో రూ.40 కోట్లు, హెడీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.20 కోట్లు ఉన్నట్లు తెలిపారు. మొత్తంగా విజయ్ సతీమణి సంగీత పేరు మీద కేవలం బ్యాంకు డిపాజిట్ల రూపంలోనే రూ.85 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా రంగంలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే నటుల్లో ఒకరైన విజయ్ పాలిటిక్స్‌లో అడుగుపెట్టిన వేళ ఆస్తుల వివరాలు హాట్ టాపిక్‌గా మారాయి.

# సిమ్ బైండింగ్ గడువు పెంపు?

మొదటి పేజీ తరువాయి

మేరకు ఈ గడువును డిసెంబర్ వరకు డెడ్‌లైన్ పొడిగించాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు టెలికం విభాగానికి చెందిన ఉన్నతాధికారులను ఉటంకిస్తూ ఈ మేరక జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. సిమ్ బైండింగ్ అంటే సిమ్ లేని ఫోన్లలో వాట్సప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్స్ పని చేయవు. గత ఎడాది నవంబర్ నెలలో ఈ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వీటి అమలుకు 90 రోజుల గడువు ఇచ్చింది. అయితే, కొత్త నిబంధనల అమలుకు టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఆయా మెసేజింగ్ యాప్స్ సంస్థలు కేంద్రం దృష్టికి తీసుకొచ్చాయి. టెస్టింగ్, ఆపరేటింగ్ సిస్టమ్ అప్డేట్స్ వంటి అంశాల్లో టెక్నికల్ సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులు చేశాయి. ఈ సవాళ్లను అధిగమించి సిమ్ బైడింగ్ రూల్స్ పక్కాగా అమలు చేసేందుకు ఆయా కంపెనీలకు మరికొంత సమయం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది.

# దొంగలెత్తుకుపోయారు!

మొదటి పేజీ తరువాయి

జీపీఎస్ సిగ్నల్ పనిచేయడం ఆగిపోయింది. దొంగలు సిగ్నల్స్‌ను నిలిపివేయడానికి హైటెక్ జామర్లను ఉపయోగించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అటు ట్రక్కు, ఇటు చాక్లెట్ల లోడ్ రెండూ కనిపించకుండా పోవడంతో ఇటలీ, జర్మనీ, పోలాండ్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన తమ సరఫరా వ్యవస్థపై జరిగిన వ్యవస్థీకృత దాడి అని నెస్లే ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భారీ నష్టం కారణంగా పోలాండ్, తూర్పు యూరప్ మార్కెట్లలో కిట్‌క్యాట్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడవచ్చని తెలుస్తోంది. సాధారణంగా ఎలక్ట్రానిక్స్ వంటి ఖరీదైన వస్తువులను లక్ష్యంగా చేసుకునే అంతర్జాతీయ ముఠాలు, ఇప్పుడు ఆహార పదార్థాలపై పడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ చాక్లెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకే ఈ చోరీకి పాల్పడి ఉంటారని అధికారులు భావిస్తున్నారు.




# కేసీఆర్ హౌస్ అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి

చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. కేసీఆర్‌ను కేటీఆర్, హరీశ్ రావు గృహ నిర్బంధం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు కాలనాగు కంటే ప్రమాదం అని వ్యాఖ్యానించారు. ‘ఎక్కడైనా ఉత్పత్తిదారుడే వస్తువు ధరను నిర్ణయిస్తారు. కానీ ఒక రైతు పండించిన పంటకు మాత్రం ఆ అవకాశం లేదు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి పాల్పడుతున్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు దేశంలో కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధర చట్టం తెచ్చింది. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువ. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్ళను నియంత్రించడానికి ఆనాడు కాంగ్రెస్ పకడ్బందీ చట్టం తీసుకొచ్చింది. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. కాకపోతే అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదు. ఆ తరువాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లారు. అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. 40 ఏళ్లుగా ఇదే పథకం కొనసాగుతోంది. ఆనాటి నుంచి దొడ్డు బియ్యమే ఇస్తూ వచ్చారు. దొడ్డు బియ్యం తినే వారు లేక ఆ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయింది. దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప పేదలకు ఉపయోగపడటం లేదని గ్రహించాం. అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించాం. ఇందుకోసం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించి సన్న వడ్లు పండించాలని ప్రోత్సహించాం. 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. భవిష్యత్ లో ఇది 90 శాతం కూడా కావచ్చు. అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు అందించాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్న బియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. పౌరసరఫరాల మంత్రి, శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైంది. నేటితో సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తయింది. మా నెక్స్ట్ టార్గెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించడం. అందుకే వరి ఒక్కటే కాదు ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నాం. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి చేయం. అవగాహన కల్పిస్తాం. ఈగల్, హైడ్రా లాగే ఆహార కల్తీని నియంత్రించడానికి ఒక వ్యవస్థను తీసుకొస్తాం. దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను తీసుకొస్తాం’ అని సీఎం పేర్కొన్నారు.

# రేషన్ సన్నబియ్యంతో లంచ్

## సీఎం రేవంత్ పక్కనే రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ దుకాణాల్లో సరఫరా చేసే సన్న బియ్యంతో భోజనం చేశారు. అసెంబ్లీలోని సెంట్రల్ హాలులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 'సన్న బియ్యం లంచ్' ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సెంట్రల్ హాలులో ఈ లంచ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కనే కూర్చుని భోజనం చేశారు. ముఖ్యమంత్రి, కోమటిరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు ఈ లంచ్‌లో పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఆలోచన తనది అయినప్పటికీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనిని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

# శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా

### హైదరాబాద్‌లో భారీ రాకెట్ గుట్టురట్టు



బంజారాహిల్స్-హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): హైదరాబాద్‌లో భారీ అక్రమ గ్యాస్ సిలిండర్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, ఈ దందాకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సోమవారం ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అధిక లాభం కోసం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ.21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి. ఇతను బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ కేజీల బరువున్న సిలిండర్లు, డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాళేశ్వరంలో లక్ష కోట్లు వృథా

### కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ఆరోపణలు

న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టుపై రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, లక్ష కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలు కారణమని అన్నారు. కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఇంకా మాట్లాడుతూ, జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళుగా ఒక్క ప్రతిపాదన పంపించలేదని అన్నారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ.873 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఉన్నప్పటికీ రూ.194 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని విమర్శించారు.

# న్యాయవాదుల రక్షణకే ప్రొటెక్షన్ బిల్లు: శ్రీధర్ బాబు

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పట్టపగలు నడిరోడ్డుపై వారు హత్యకు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతోనే వారిని హత్య చేశారని ఆరోపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకువస్తున్నట్లు చెప్పారు.

# గణపతి వెంటనే లొంగిపో

### మావోయిస్టు అగ్రనేతకు డీజీపీ సూచన



హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): దేశంలో మావోయిజం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31 డెడ్‌లైన్ మరికొన్ని గంటల్లో ముగియనున్న నేపథ్యంలో, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మావోయిస్టులకు కీలక పిలుపునిచ్చారు. హింసా మార్గాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలిసి గౌరవప్రదమైన జీవితం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఉన్న మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు తక్షణమే లొంగిపోవాలని కోరారు. గణపతి ఆరోగ్యం క్షీణించిందని తమకు సమాచారం ఉందని వెల్లడించిన డీజీపీ... ఆయన లొంగిపోతే ప్రభుత్వ ఖర్చులతోనే పూర్తి స్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తామని భరోసానిచ్చారు. గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మరో ఏడుగురు ముఖ్య నేతలు కూడా వెంటనే ఆయుధాలు వీడాలని కోరారు. గత రెండేళ్లలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారందరికీ ప్రభుత్వం తరపున మెరుగైన పునరావాసం కల్పించామని ఆయన గుర్తు చేశారు. కేంద్రం విధించిన గడువు మంగళవారంతో ముగియనున్న తరుణంలో, అజ్ఞాతంలో ఉన్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# మిలియన్ మార్చ్ కేసులు కొట్టేయండి

### హైకోర్టుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు

### పిటిషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన పాత కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. 2011లో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు తాము శాంతియుతంగా నిరసన తెలిపామని, అయితే అప్పటి ప్రభుత్వం రాజకీయ కారణాలతో తమపై అక్రమ కేసులు నమోదు చేసిందని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. దశాబ్ద కాలం గడిచినా ఈ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తక్షణమే కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై పూర్తి వివరాలతో కూడిన 'కౌంటర్' దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పటి ఘటనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు, ప్రస్తుత కేసు స్థితిగతులను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

# క్యూబాకు రష్యా చమురు నౌక

వాషింగ్టన్: క్యూబాకు వెళ్లే రష్యా చమురు నౌకను అనుమతిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. క్యూబాకు చమురు రవాణాపై కొంతకాలంగా అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నాయి. తాజాగా ట్రంప్ ఈ ఆంక్షలను సడలించారు. 7.3 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో రష్యా నౌక 'అనాటోలీ కొలోడ్కిన్' మార్చి 8న రష్యా పోర్ట్ నుంచి బయలుదేరింది. ఇంగ్లీష్ ఛానల్ మీదుగా అట్లాంటిక్ చేరుకుంది. అయితే అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఈ నౌక క్యూబా చేరడంపై ఇప్పటి వరకు సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో ట్రంప్ స్పందిస్తూ, క్యూబాకు చమురు చేరవేయాలని ఏ దేశం అనుకుంటుందో దానితో తమకు సమస్య లేదని, అది రష్యా అయినా, మరే దేశమైనా ఇబ్బంది లేదని అన్నారు. ఎందుకంటే క్యూబా ప్రభుత్వం త్వరలో నేలకూలుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

### గవర్నర్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలు ఉన్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో సైతం మైనింగ్ చేస్తోందని, దీనికి సంబంధించి కనీస అనుమతులు కూడా తీసుకోలేదని పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో వివరించింది. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారే తప్ప ప్రభుత్వం స్పందించలేదని నేతలు అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు. అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే పొంగులేటి వ్యవహారంతో పాటు అమృత్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన విమర్శించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సస్పెండ్

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): శాసనమండలిలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ నుంచి సస్పెండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ప్రతిపక్షం చేపట్టిన నిరసన చివరకు సభ్యుల బహిష్కరణకు దారితీసింది. సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పొంగులేటి వ్యవహారంపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ అనుమతించకపోవడంతో సభ్యులందరూ ఒక్కసారిగా పోడియం వద్దకు దూసుకువెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై మండలి చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు సీట్లలోకి వెళ్లాలని పదే పదే విజ్ఞప్తి చేసినా వినకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. పోడియం వద్ద ఆందోళన చేస్తున్న సభ్యులను అడ్డుకునేందుకు మార్షల్స్ రంగంలోకి దిగారు. ఈ క్రమంలో మార్షల్స్ - బీఆర్ఎస్ ఎమ్మెల్సీల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట చోటుచేసుకుంది. సభ్యుల ప్రవర్తన సభా నియమావళికి విరుద్ధమని భావించిన చైర్మన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అందరినీ ఒకరోజు పాటు సభ నుండి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ వేటుకు గురైన వారిలో మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవరెడ్డి, సుంకరి రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కోటిరెడ్డి ఉన్నారు. సస్పెన్షన్ అనంతరం బయటకు వచ్చిన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని మండిపడ్డారు. మంత్రిపై వస్తున్న తీవ్రమైన ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ సస్పెన్షన్ డ్రామా ఆడారని ఆరోపించారు. తాము సస్పెన్షన్లకు భయపడబోమని, ప్రజా క్షేత్రంలో మంత్రి అక్రమాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

# ఉద్యమకారులపై చిన్నచూపేల?: విజయశాంతి

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): తెలంగాణ కోసం తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే, ఈరోజు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ ఉండేవారా అని శాసనమండలి ఎమ్మెల్సీ విజయశాంతి ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన వారి తరపున విజయశాంతి మండలిలో తన గళం వినిపించారు. పదవుల కంటే ముందు ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు వివిధ సందర్భాలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఉద్యమకారుల విషయంలో ఈ ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తే, కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలుస్తుందని అన్నారు. లేదంటే చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కేటీఆర్ ఇంట్లో పొలిటికల్ బ్రేక్‌ఫాస్ట్

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): నార్సింగి సర్కిల్ పరిధిలోని పుప్పాలగూడలో ఉన్న జయభేరి టెంపుల్ ట్రీ విల్లాలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసానికి బీఆర్ఎస్ కీలక నేతలు వెళ్లారు. కేటీఆర్ ఏర్పాటు చేసిన ఈ 'బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్' ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కృష్ణారావు, పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు కేటీఆర్ నివాసానికి వెళ్లారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న ఆరోపణలు, సభలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎలా తిప్పికొట్టాలనే అంశంపై నేతలు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో చేయాలనే దానిపై కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

# ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే హేట్ స్పీచ్ బిల్లు

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక 'క్రూరమైన ఆయుధం' అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. "ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు. ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. "ఇప్పటికే తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ కొత్త చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఈగల్, హైడ్రా తరహాలో మరో వ్యవస్థ: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా, ఈగల్ తరహాలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# చీపురుతో విద్యార్థులపై కామాటి దాడి

**జగిత్యాల ఎస్టీ హాస్టల్‌లో దారుణం**

జగిత్యాల టౌన్, మార్చి 30 (ఈవార్తలు): జగిత్యాల ఎస్టీ హాస్టల్‌లో ఒ అమానుష ఘటన చోటు చేసుకుంది. హాస్టల్లో నిద్రిస్తున్న పిల్లలను చీపిరితో విద్యార్థులను కూరగాయలను కోసే వ్యక్తి చితకబాదటంతో ఇప్పుడు ఇప్పుడు ఆ సంఘటన సంచలనంగా మారింది. ఉదయ కాలం పిల్లను నిద్రలేపాల్సిన సమయంలో వారి పై హస్టల్లో కూరగాయలు కోసే కామటి అనే వ్యక్తి పిల్లలను చీపిరితో బాదుతూ ఒక్కోవిద్యార్థిని లేపుతున్నాడు. ఈ సంఘట అక్క రికార్డు అయింది. దీంతో సాదారణంగా హస్టల్ వార్డెన్ చేయాల్సిన పనులను సక్రమంగా నిర్వర్తించక పోవడం లేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనతో అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



రోజు మద్యం తాగి వచ్చి కూరగాయాలు కోసే కామటి అనే వ్యక్తి వచ్చి పిల్లలను హింసిస్తూ విధులకు హాజరవుతున్నారని అక్కడి విద్యార్థులు ఉన్నతాధికారులకు తెలిపారు. గత నాలుగు నెలలుగా ఇలానే మద్యం సేవించి పిల్లను హింసిస్తున్నాడని విద్యార్థులు తెలిపారు. ఈ సంఘటన పై కొంత మంది విద్యార్థి నాయకులు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసారు. కాగా, ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. కామాటిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# చదువుకోవాలని ఉంది.. చదవించండి!

**ప్రజావాణిలో కలెక్టర్‌కు బాలిక మొర**



జగిత్యాల టౌన్, మార్చి 30 (ఈవార్తలు): చదువుకోవాలని ఉందంటూ.. ప్రజావాణిని ఆశ్రయించింది ఓ బాలిక. జగిత్యాల జిల్లాలో జరిగిందీ ఘటన. జిల్లా కేంద్రంలోని పురాణిపేట గవర్నమెంట్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న గ్రీష్మ అనే బాలిక ప్రజావాణిని ఆశ్రయించింది. తాను ఇంతకముందు చదివిన స్కూల్లో టీసీ ఇవ్వడంలేదంటూ ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేసింది గ్రీష్మ. తల్లి అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో, ఇంటి బాధ్యతలన్నీ తన భుజాలపై పడిపోయాయని, సరిగ్గా పాఠశాలకు హాజరు కాలేకపోయానని ఆవేదన వ్యక్తం చేసింది బాలిక. ఇంతకుముందు చదివిన స్కూల్లో టీసీ ఆలస్యంగా రావడంతో, ఇంటి దగ్గర ఉన్న మరో ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేసుకోవడానికి నిరాకరించారని తెలిపింది గ్రీష్మ. పరీక్షలు దగ్గరపడుతున్నాయని, తనకు చదువుకోవాలనే ఆసక్తి ఉందని గ్రీష్మ తెలిపింది. ఎలాగైనా తనకు పరీక్షలు రాసే అవకాశం ఇవ్వండి అంటూ కలెక్టర్‌ను వేడుకుంది గ్రీష్మ. బాలిక అభ్యర్థనకు స్పందించిన కలెక్టర్ సత్య ప్రసాద్.. జిల్లా విద్యాశాఖ అధికారి రాముతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడిన డీఈవో రాము.. విద్యార్థిని పరీక్ష రాసేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

# అమ్మ మా ఆస్తి లాగేసుకుంది

**కలెక్టర్‌కు అన్నాచెల్లి ఫిర్యాదు**

జగిత్యాల టౌన్, మార్చి 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఆరపేటకు చెందిన అన్నాచెల్లెల్లు (పిల్లలు) కన్న తల్లి పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాన్న సంపాదించిన భూమి మొత్తాన్ని తమ తల్లి వందన దొంగ విరాసత్ చేయించుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము మైనర్లు కావడంతో తమ తండ్రి సంపాదించిన భూమి మొత్తాన్ని తమకు తెలియకుండానే కోటి నాలుగు లక్షల రూపాయలకు అమ్మేసిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు న్యాయంగా, వారసత్వంగా రావాల్సిన వాటా ఇప్పించాలని అధికారులకు విన్నవించారు. భూమి అమ్మకానికి సంబంధించిన కోటి రూపాయల లావాదేవి మొత్తం నగదు రూపంలోనే జరిగిందని, అదంతా బ్లాక్ మనీ అని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల, మార్చి 30 (ఈవార్తలు): తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి.




## ప్రతిభ హై స్కూల్‌లో రోబోటిక్ ఎక్స్‌పో

మల్యాల, మార్చి 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి ప్రతిభ హై స్కూల్‌లో విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో రోబోటిక్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల రోబోటిక్ మోడళ్లు, ఆటోమేటిక్ యంత్రాలు, సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రత్యేకంగా లైన్ ఫాలోయింగ్ రోబో, ఆటోమేటిక్ డోర్ సిస్టమ్, స్మార్ట్ అగ్రికల్చర్ మోడల్ వంటి ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల పనితీరు గురించి వివరించి, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమిర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. ఈ ఎక్స్‌పోను పలు పాఠశాలల విద్యార్థులు కూడా వీక్షించారు.



## జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలి

**రజక నేత చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్**

**ఐలమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన**

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, చాకలి ఐలమ్మ కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. గన్ పార్క్ వద్ద నిరసన చేపట్టగా, వారిని పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన గాడ్గే.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెడతానని హామీ ఇచ్చారని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## సర్కారు సార్లూ.. జర వైద్య కార్మికులను చూడరూ!

నల్లగొండ, మార్చి 30 (ఈవార్తలు): కొన్నేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైద్య కార్మికులు సర్కారు ముందు గోడు వెల్లబోసుకుంటున్నారు. కనీస వేతనం, ఐఎఫ్ఎంఐఎస్‌లో విలీనం తదితర అంశాలపై చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్వీఎస్ ఎంఅండ్ హెచ్ వర్కర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కుర్రి సైదయ్య నేతృత్వంలో సోమవారం నల్లగొండ జీజీహెచ్-ఎంసీహెచ్ హాస్పిటల్‌లో కార్మికులను కలిసి ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. కనీస వేతనం రూ.26,000, ప్రభుత్వమే ఎంప్లాయర్ షేర్ చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా నిర్ణయాలను వివరించారు. సైదయ్య వెంట స్టేట్ జనరల్ సెక్రటరీ చిన్న బొస్క నరేశ్, నాగమణి, జానకి, శంకర్, రవి, నరసింహ తదితరులు ఉన్నారు.

## ఆళ్ల రామకృష్ణారెడ్డి 3 పిటిషన్లు కొట్టివేత

అమరావతి, మార్చి 30 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈరోజు కొట్టివేసింది. ఈ పిటిషన్లకు చట్టబద్ధంగా విచారణార్హత లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇతర నిందితులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును రాష్ట్ర ఏజెన్సీల నుంచి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించాలంటూ ఒక పిటిషన్... ఇదే కేసులో చంద్రబాబుకు గతంలో మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ మరో పిటిషన్... ఏసీబీ కోర్టులో ఉన్న ఈ కేసు విచారణను ఎంపీలు-ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ మూడో పిటిషన్ ను ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేశారు. ఈ మూడు పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాజకీయ కారణాలతో లేదా ఇతర ఉద్దేశాలతో వేసిన పిటిషన్లుగా వీటిని పరిగణించింది.

# హనుమత్ విజయోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

మల్యాల, మార్చి 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు హనుమాన్ విజయోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం రోజున కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. హెల్ప్ సెంటర్, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు 6 ప్రదేశాల్లో ఏర్పాటు, ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ల ఏర్పాటు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. దీక్ష విరమణ, ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల వద్ద బందోబస్త్ ఏర్పాటు



చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వేములవాడ, జగిత్యాల, కరీంనగర్ నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీపీవో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనారెడ్డి, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుల్లో రూ.10కే టీ

**ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం**

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి. రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి



యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' ఔట్‌లెట్లను కూడా తెరిచారు. ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెదు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది. ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

## రెండున్నర లక్షల మందితో గృహ ప్రవేశం

తిరుపతి, మార్చి 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లా నాయుడుపేట వేదికగా రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేసి, వారితో గృహ ప్రవేశాలు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత



ఇంత భారీ స్థాయిలో గృహ ప్రవేశాలు నిర్వహించడం ఇది రెండోసారి కావడం విశేషం. సోమవారం పంపిణీ చేసిన ఇళ్లలో 1,00,875 టిడ్కో గృహాలు ఉండగా, మిగిలిన 1,50,018 సాధారణ గృహాలు ఉన్నాయి. గతేడాది నవంబర్ 12న ఇప్పటికే 3 లక్షల మందికి ప్రభుత్వం ఇళ్లను అందించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పేదల ముఖాల్లో ఆనందం చూస్తుంటే నా జన్మ ధన్యమైందనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని, పేదల పొట్ట కొట్టిందని మండిపడ్డారు. పేదలు మురికివాడల్లో కాదు, గౌరవప్రదమైన టిడ్కో ఇళ్లలో ఉండాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు కట్టిన రూ. 174 కోట్లను మాయం చేశారని, ఆ మొత్తాన్ని తిరిగి 82 వేల కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ సీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, దానికి రాయితీ కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, బీసీలకు రూ. 20 వేల విద్యుత్ రాయితీ ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఏప్రిల్ నుంచి తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, సరిగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేల పనితీరుపై కూడా నిఘా ఉంటుందని, ప్రజల మెప్పు పొందని నాయకులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టెక్నాలజీని ఉపయోగించి పెన్షన్ల పంపిణీని రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు వెల్లడించారు.

## సీఎంఏలో మెరిసిన అఖిల నాగ రమ్య

**బెంగళూరు వేదికపై ఖమ్మం అమ్మాయి సత్తా**



ఖమ్మం, మార్చి 30 (ఈవార్తలు): ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థిని అర్వపల్లి అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన సీఎంఏ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, బెంగళూరు వేదికపై ప్రశంసలు అందుకుని జిల్లా ఖ్యాతిని చాటింది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ విజయంతో తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించడమే కాకుండా, అనేక మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంకు చెందిన అర్వపల్లి నగేష్ - శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె అయిన అఖిల నాగ రమ్య చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచింది. మౌంట్ ఫోర్ట్ స్కూల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి, పదో తరగతిలో 9.5 జీపీఏతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. అనంతరం సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ అగ్రశ్రేణి ఫలితాలు సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా గుంటూరులోని ప్రముఖ 'మాస్టర్ మైండ్' కాలేజీలో సి.ఎం.ఎ కోర్సులో చేర్పించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి, బెంగళూరులో జరిగిన గౌరవ కార్యక్రమంలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా అఖిల మాట్లాడుతూ, 'నా విజయానికి ప్రధాన కారణం నా తల్లిదండ్రులే. వారి కష్టం, ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. నా విజయం వారికే అంకితం' అని తెలిపింది. అఖిల నాగ రమ్య విజయం పట్ల స్థానికులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆమె చెల్లెలు యువ నాగశ్రీ ప్రస్తుతం గుంటూరులో చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు అభ్యసిస్తుండటం కుటుంబంలో విద్యాపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. సంకల్పం, కృషి, కుటుంబ సహకారం ఉంటే ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చని అఖిల విజయం మరోసారి నిరూపించింది.

## కుల వ్యవస్థను రద్దు చేయాలి

**సుప్రీంకోర్టు తీర్పుపై మంద కృష్ణ మాదిగ**

హైదరాబాద్, మార్చి 30 (ఈవార్తలు): దళితులు క్రైస్తవ మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందన్న సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అసహనం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... న్యాయవ్యవస్థ, పార్లమెంట్, రాష్ట్రపతికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మత మార్పిడి ఆధారంగా హోదాలు తొలగించడం కాకుండా, దేశంలో వేళ్లూనుకున్న కుల వ్యవస్థనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1950లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగానే సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని, అయితే ఆ ఉత్తర్వులే రాజ్యాంగ విరుద్ధమని మంద కృష్ణ విమర్శించారు. అవి వివక్షతో కూడుకున్నవని, దళితుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. కుల వ్యవస్థ వల్ల అత్యంత దారుణంగా నష్టపోయింది దళితులేనని, పశువుల కంటే హీనంగా చూడబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మారినంత మాత్రాన దళితులు ఎదుర్కొనే సామాజిక వివక్ష పోదని, అందుకే ఎస్సీ హోదా కొనసాగించాలని కోరారు. దేశంలోని కుల వ్యవస్థలో బ్రాహ్మణేతర వర్గాలన్నీ బాధితులేనని మంద కృష్ణ పేర్కొన్నారు. "ఈ వ్యవస్థలో ఏ రెండు కులాల మధ్య సామాజిక సామరస్యం లేదు. కానీ అన్ని కులాల మీద ఆధిపత్యం చెలాయిస్తూ, గౌరవం పొందుతున్నది మాత్రం బ్రాహ్మణ వ్యవస్థే" అని ఆయన ఆరోపించారు. అసమానతలను కోరుకునే వారే కుల వ్యవస్థ ఉండాలని కోరుకుంటారని, సమానత్వాన్ని కాంక్షించే వారు కుల నిర్మూలన కోసం పోరాడతారని తెలిపారు. కుల వ్యవస్థ రద్దుపై ఏ రాజకీయ పార్టీకి ఏ విధమైన అభిప్రాయం ఉందో బహిరంగంగా వెల్లడించాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. అంటరానితనం ఏ వ్యవస్థ నుంచి పుట్టిందో పార్టీలు స్పష్టం చేయాలన్నారు. కుల వ్యవస్థను రద్దు చేసేందుకు ఏ పార్టీ లేదా సంస్థ ముందుకు వచ్చినా, ఎమ్మార్పీఎస్ తరఫున వారికి అండగా నిలబడతామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉందని, దీనిపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు తొత్తుగా రెవెన్యూ: పేర్ని నాని

మచిలీపట్నం, మార్చి 30 (ఈవార్తలు): బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు. పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు.

# లెగ్ పీస్ రాలేదని పెళ్లిలో రచ్చ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఒక పెళ్లి వేడుక రణరంగాన్ని తలపించింది. బిర్యానీలో చికెన్ లెగ్ పీస్ వడ్డించలేదన్న చిన్న కారణంతో బంధువులు ఒకరిపై ఒకరు కుర్చీలతో దాడి చేసుకున్నారు. అమ్రోహా జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. అమ్రోహాలోని ఒక వెడ్డింగ్ హాల్‌లో వివాహ విందు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో కొందరు అతిథులకు వడ్డించిన బిర్యానీలో లెగ్ పీసులు లేకపోవడంతో వారు క్యాటరింగ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరగడంతో పరిస్థితి చేయి దాటింది. ఆగ్రహంతో ఊగిపోయిన ఇరువర్గాల వారు అక్కడున్న ప్లాస్టిక్ కుర్చీలను ఒకరిపై ఒకరు విసురుకోవడం ప్రారంభించారు. ఈ గొడవతో పెళ్లికి వచ్చిన మిగతా వారు భయంతో బయటకు పరుగులు తీశారు. కొందరు ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఈ దాడిలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కేవలం ఒక చికెన్ ముక్క కోసం పెళ్లి వేడుకలో ఇంతటి గొడవ జరగడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



# మహిళల లోదుస్తులే టార్గెట్

## కర్ణాటకలో విచిత్ర దొంగ

కొప్పల్: కర్ణాటకలోని కొప్పల్ జిల్లా గంగావతి పట్టణంలో ఓ వింత దొంగ స్థానికులను, ముఖ్యంగా మహిళలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాడు. రాత్రిపూట ఇళ్లలోకి చొరబడి కేవలం మహిళల లోదుస్తులను మాత్రమే దొంగిలిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఈ ఘటనలు చోటుచేసుకుంటుండటంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. గంగావతి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రముఖ నివాస ప్రాంతమైన సీబీఎస్ కాలనీలో ఈ వింత దొంగతనాలు జరుగుతున్నాయి. ఓ గుర్తుతెలియని వ్యక్తి రాత్రి సమయంలో ఇళ్ల ప్రహరీ గోడలు దూకి, ఆరుబయట ఆరవేసిన మహిళల లోదుస్తులను ఎత్తుకెళ్తున్నాడు. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికుల్లో



భయాందోళనలు మరింత పెరిగాయి. గత మూడు, నాలుగు రోజులుగా ఇదే తరహా ఘటనలు పునరావృతం కావడంతో తమ భద్రత, గోప్యతపై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని ఓ 'సైకో'గా అభివర్ణిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి వింత ఘటనలు కర్ణాటకలో జరగడం ఇదే మొదటిసారి కాదు. గతేడాది సెప్టెంబర్ 30న హుబ్బళ్లిలోని బెండిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాగే మహిళల లోదుస్తులను దొంగిలించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారం రోజుల తర్వాత ఆ దొంగిలించిన దుస్తులను తిరిగి అదే ఇళ్లలో పడేసేవాడని విచారణలో తేలింది. అలాగే, బెంగళూరు హెబ్బగోడి పోలీసులు ఓ 23 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. అతను మహిళల లోదుస్తులు ధరించి బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ మహిళలను భయభ్రాంతులకు గురిచేశాడు. ఇలాంటి ప్రవర్తన కొన్నిసార్లు తీవ్రమైన నేరాలకు సంకేతంగా మారుతుంది. 2002లో అరెస్టయిన సీరియల్ రేపిస్ట్, హంతకుడు ఉమేశ్ రెడ్డి కేసు దీనికి ఉదాహరణ. అతడిని అరెస్ట్ చేసే సమయానికి మహిళల బ్రా, ప్యాంటీ ధరించి ఉన్నాడు. అతని వద్ద నుంచి 10 బ్రాలు, 18 ప్యాంటీలు, చీరలు, నైటీలతో పాటు పెద్ద మొత్తంలో మహిళల దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గంగావతి ఘటనపై పోలీసులు దృష్టి సారించి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# సహజీవన జంటలకూ కుటుంబ హోదా

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన

న్యూఢిల్లీ: భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై 'కుటుంబం'గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం వివరాలను వెల్లడించారు. తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో 'గృహ గణన' చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు. రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు. ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

# కథలు చెప్పనున్న సెలెబ్రిటీలు

చిన్నారుల కోసం ఉషా వాన్స్ కొత్త ప్రాజెక్టు

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అర్ధాంగి ఉషా వాన్స్ చిన్నారుల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సోమవారం ఒక కొత్త పాడ్‌కాస్ట్‌ను ప్రారంభించారు. 'స్టోరీటైమ్ విత్ ది సెకండ్ లేడీ' పేరుతో వచ్చిన ఈ కార్యక్రమంలో కథలు చెప్పడంతో పాటు, ప్రముఖులు కూడా భాగస్వామ్యం కానున్నారు. తొలి మూడు ఎపిసోడ్‌లను స్పాటిఫై, యూట్యూబ్‌లలో ఏకకాలంలో విడుదల చేశారు. తొలి ఎపిసోడ్‌లో, ఉషా వాన్స్ తనకు చిన్నప్పటి నుంచి ఇష్టమైన 'ది టేల్ ఆఫ్ పీటర్ రాబిట్' కథను చదివి వినిపించారు. ప్రస్తుతం తన పిల్లలకు కూడా ఇదే కథను చదివి వినిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. "మా పిల్లలతో కలిసి కథలు చదవడం నా రోజులో అత్యంత సంతోషకరమైన సమయం. పుస్తకాలు మమ్మల్ని ఎన్నో సాహస యాత్రలకు తీసుకెళ్లాయి" అని ఉషా వాన్స్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల వెలుపల పిల్లల్లో పఠనాసక్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్ ఎపిసోడ్లలో క్రీడాకారులు, రచయితలు, ఇతర ప్రముఖులు అతిథులుగా పాల్గొంటారు. ఒక ఎపిసోడ్‌లో మాజీ రేసింగ్ డ్రైవర్ డానికా పాట్రిక్ 'కార్స్' కథను చదవగా, మరో ఎపిసోడ్‌లో పారాలింపియన్ బ్రెంట్ పోపెన్ తన పుస్తకం 'ప్లేగ్రౌండ్ లెసన్స్' నుంచి కథను వినిపించారు. గత ఏడాది జూన్ 2025లో ప్రారంభించిన 'సమ్మర్ రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ పాడ్‌కాస్ట్‌ను తీసుకొచ్చారు. కరోనా మహమ్మారి తర్వాత విద్యార్థుల్లో తగ్గుతున్న పఠన నైపుణ్యాలపై ఆందోళనల నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఏర్పడింది. "మనం చదివినప్పుడు ఎదుగుతాం" అనే సందేశంతో ఉషా వాన్స్ ప్రతి ఎపిసోడ్‌ను ముగిస్తున్నారు.

# ఇరాన్‌పై అణుదాడికి సన్నాహాలు?


### ఐక్యరాజ్యసమితిలో పదవికి దౌత్యవేత్త రాజీనామా



జెనీవా: ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త మహమద్ సఫా తన పదవికి రాజీనామా చేస్తూ, సంచలన ఆరోపణలు చేశారు. ఇరాన్‌పై అణ్వాయుధాలు ప్రయోగించేందుకు ఐక్యరాజ్యసమితిలోని ఓ వర్గం మద్దతు ఇస్తోందని, ఈ మానవత్వ వ్యతిరేక నేరంలో తాను భాగస్వామిని కాలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో ఒక లేఖ ద్వారా ఆయన వెల్లడించారు. 'ఇరాన్‌పై అణుదాడికి ఐక్యరాజ్యసమితి 'సహకారం' అందిస్తోందన్న విషయాన్ని ప్రజలు గ్రహించడం లేదు. టెహ్రాన్ ఒక ఖాళీ ఎడారి కాదు. అక్కడ కుటుంబాలు, పిల్లలు, కలలు కనే మనుషులు ఉన్నారు. యుద్ధం కోరుకునే వారు మానసికంగా అనారోగ్యంతో ఉన్నట్టే' అని సఫా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సుమారు కోటి మంది జనాభా ఉన్న టెహ్రాన్‌పై అణుదాడి చేస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని, వాషింగ్టన్, బెర్లిన్, లండన్ వంటి నగరాలపై ఇలాంటి దాడి జరిగితే పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ నిజాన్ని బయటపెట్టడం కోసమే తన దౌత్యపరమైన కెరీర్‌ను వదులుకున్నానని, ముప్పు ఏర్పడకముందే దీన్ని ఆపాలని ప్రపంచ ప్రజలకు పిలుపునిచ్చారు. మహమద్ సఫా 2016 నుంచి 'పేట్రియాటిక్ విజన్' (పీవీఏ) అనే అంతర్జాతీయ సంస్థకు ఐక్యరాజ్యసమితిలో ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థకు ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలిలో ప్రత్యేక సలహా హోదా ఉంది. 2013 నుంచి ఆయన పీవీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. గత మూడేళ్లుగా తాను ఎంతో ఓపిక పట్టానని, 2023లోనే రాజీనామా చేయాలని భావించినట్లు సఫా చెప్పారు. 2023 అక్టోబర్‌లో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత తన అభిప్రాయాల కారణంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌ను విమర్శించడానికి ఐక్యరాజ్యసమితిలోని కొందరు సీనియర్ అధికారులు ఇష్టపడటం లేదని ఆయన ఆరోపించారు. ఒక 'శక్తివంతమైన లాబీ' కొత్త ప్రపంచ వ్యవస్థను సృష్టించిందని, దానికి కొందరు ఐక్యరాజ్యసమితి అధికారులు 'సేవ' చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాల తర్వాత తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మరణ బెదిరింపులు వచ్చాయని సఫా వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో నేరుగా కాకపోయినా, సదరు లాబీకి 'సేవ' చేస్తున్న అధికారుల ద్వారా సెన్సార్‌షిప్‌ను ఎదుర్కొన్నట్లు ఆయన ఆరోపించారు. సఫా చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై ఐక్యరాజ్యసమితి ఇంకా స్పందించలేదు. మధ్యప్రాచ్యంలో ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# నక్సలిజానికి వేరే దారిలేదు

## దాదాపు అంతమైంది.. లోక్ సభలో అమిత్ షా ప్రకటన.. నేటితో కగార్ డెడ్‌లైన్ పూర్తి



న్యూఢిల్లీ: నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు. ఆయుధాలు పట్టుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నక్సలిజాన్ని సమర్థించేవాళ్లు తెలుసుకోవాలని హితవు పలికారు. ఆపరేషన్ కగార్, నక్సలిజం నిర్మూలన చర్యలపై ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ, మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని తెలిపారు. ఆయుధాలు పట్టడం సరైన చర్య కాదని ఆయన పేర్కొన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నా, ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు. ఎన్డీయే వచ్చాక గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని అన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి జరగలేదో చెప్పాలని నిలదీశారు. నక్సలిజం పేదరికం వల్ల విస్తరించలేదని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు పలు ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపారని, అభివృద్ధి పనులను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని కొందరు కోరుతున్నారని, కానీ వారి హింసకు బలైన వారి గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాలకే దక్కుతుందని అన్నారు. "సమస్యలను ఆయుధాల ద్వారా కాదు, చర్చల ద్వారానే పరిష్కరించగలం" అని ఆయన పిలుపునిచ్చారు. అయితే ఆయుధాలు విడిచిపెట్టిన వారితో మాత్రమే చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బస్తర్‌లోని ఆదివాసీలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను అందిస్తోందని అన్నారు. ఇది మోదీ ప్రభుత్వమని, ఆయుధాలు పట్టుకుంటామంటే కుదరదని స్పష్టం చేశారు. ఆదివాసీల అభివద్ధి జరగలేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, కానీ 60 ఏళ్లు వారే పాలించారని గుర్తించాలని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తమపై నిందలు మోపే ప్రయత్నం సరికాదని అన్నారు. ఏడాది కాలంలో 706 మంది మావోయిస్టులు మృతి చెందారని, 4800 మంది లొంగిపోయారని అమిత్ షా ప్రకటించారు.

# ఢిల్లీలో లష్కరే ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో లష్కరే తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాది షబీర్ అహ్మద్ లోన్‌ను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్ట్ చేసింది. ఆదివారం రాత్రి ఘాజీపూర్ ప్రాంతంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. ఇటీవల ఢిల్లీ మెట్రో స్టేషన్లలో దేశ వ్యతిరేక పోస్టర్లు అతికించిన ఘటనకు సంబంధించిన ఉగ్ర మాడ్యూల్‌కు షబీర్ లోన్ హ్యాండ్లర్‌గా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. గత ఫిబ్రవరి 8న సుప్రీంకోర్టు, జన్‌పథ్ మెట్రో స్టేషన్లతో సహా పలు ప్రాంతాల్లో దేశ వ్యతిరేక సందేశాలతో కూడిన పోస్టర్లు కలకలం రేపాయి. ఈ ఘటనపై సీఐఎస్ఎఫ్ ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన స్పెషల్ సెల్ అధికారులు, సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి నిఘాతో దర్యాప్తు చేపట్టారు. ఈ అరెస్టును ధృవీకరించిన అదనపు సీపీ ప్రమోద్ సింగ్ కుష్వాహా కీలక వివరాలు వెల్లడించారు. "గతంలో మేం ఛేదించిన ఓ ఉగ్ర మాడ్యూల్‌కు షబీర్ లోన్ నాయకుడిగా ఉండేవాడు. అందులో ఏడుగురు బంగ్లాదేశీయులు, ఒక భారతీయుడు ఉన్నారు. ఆ మాడ్యూల్ ఛిన్నాభిన్నం కావడంతో, కొత్త మాడ్యూల్ ఏర్పాటు చేసి, యువకులను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు అతడు మళ్లీ భారత్‌లోకి ప్రవేశించాడు" అని వివరించారు. షబీర్ లోన్ గతంలో 2007, 2015 సంవత్సరాల్లోనూ అరెస్టయ్యాడని పోలీసులు తెలిపారు. 2015లో కశ్మీర్‌లో పట్టుబడినప్పుడు అతని వద్ద ఏకే-47 రైఫిల్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. 2019లో బెయిల్‌పై విడుదలైన షబీర్, ఆ తర్వాత బంగ్లాదేశ్‌కు పారిపోయినట్లు దర్యాప్తులో తేలింది. అక్కడ నుంచే లష్కరే తోయిబా అగ్ర కమాండర్లు, 2008 ముంబై దాడుల సూత్రధారులు హఫీజ్ సయీద్, జాకీ-ఉర్-రెహ్మాన్ లఖ్వీలతో నిరంతరం సంబంధాలు కొనసాగించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడిని విచారిస్తున్నామని, ఉగ్ర కుట్ర పూర్తి వివరాలు, వారి లక్ష్యాలపై ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు.

# స్టాలిన్ నామినేషన్ దాఖలు



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీవీకే అధ్యక్షుడు విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వరుసగా మూడుసార్లు కొళత్తూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయన ఈసారి కూడా అక్కడి నుంచే బరిలోకి దిగుతున్నారు. నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఢిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోందని అన్నారు. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నామని కార్యకర్తలను, అభిమానులను ఉద్దేశించి అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూరు, తూర్పు తిరుచ్చి నుంచి బరిలోకి దిగుతున్న విజయ్, తాజాగా పెరంబూరు నుంచి నామినేషన్ దాఖలు చేశారు. విజయ్‌ని చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విజయ్ మాట్లాడుతూ, నేను ఎంపిక చేసిన వారు కేవలం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మాత్రమే కాదని, వారు ప్రజలకు రక్షకులు అని అన్నారు. వారికి మీ మద్దతు ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు.

# ఎల్డీఎఫ్-బీజేపీ రహస్య ఒప్పందం

### కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు



పత్తనంతిట్ట: కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) - కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు. పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# అమెరికా విమానాలకు స్పెయిన్ గగనతలం క్లోజ్

మాడ్రిడ్: ఇరాన్‌పై దాడులలో పాల్గొంటున్న అమెరికా యుద్ధ విమానాల కోసం తమ దేశం గగనతలాన్ని మూసివేసినట్లు స్పెయిన్ రక్షణ మంత్రి మార్గరీటా రోబెల్స్ ప్రకటించారు. ఇరుదేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. తాజాగా, గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్‌తో యుద్ధానికి సంబంధించిన చర్యల కోసం సైనిక స్థావరాల వినియోగం లేదా గగనతల వినియోగానికి తాము అనుమతిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఏకపక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు. కాగా, అమెరికా, ఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన చెబుతున్నారు.

# మధ్యలో నువ్వు ఎవడివయ్యా!

### మీ మధ్యవర్తిత్వం మాకు అవసరం లేదు.. పాకిస్థాన్‌కు ఇరాన్ షాక్

టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ చేసిన ప్రకటనపై ఇరాన్ స్పందించింది. పాకిస్థాన్ నేతృత్వంలో జరిపే సంధి ప్రయత్నాలలో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ స్పష్టం చేసింది. పాకిస్థాన్ ప్రయత్నాలకు ఇరాన్ నో చెప్పింది. ఈ మేరకు ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ సోమవారం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని, కేవలం మధ్యవర్తుల ద్వారా అసమంజసమైన డిమాండ్లు మాత్రమే వచ్చాయని పేర్కొంది. పాకిస్థాన్ చర్చా వేదికలు వారి సొంత వ్యవహారమని, వాటిలో ఇరాన్ పాల్గొనలేదని కాన్సులేట్ స్పష్టం చేసింది. అమెరికా దౌత్యం ఎప్పటికప్పుడు మారుతుందని, మాటలు మారుస్తుందని ఆరోపించింది. కానీ ఈ విషయంలో తమ వైఖరి సుస్పష్టమని తెలిపింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రకటన వారి సొంత ప్రణాళికలేనని తెలిపింది. యుద్ధం ముగింపు కోసం ఇస్తున్న పిలుపు స్వాగతించదగినదేనని, కానీ యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరో గుర్తుంచుకోవాలని ఇరాన్ కాన్సులేట్ వ్యాఖ్యానించింది. రెండు రోజుల క్రితం ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో సౌదీ అరేబియా, ఈజిప్ట్, టర్కీ మంత్రులు సమావేశమైన విషయం తెలిసిందే. పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచ దేశాలపై పడుతోన్న ప్రభావం గురించి వారు చర్చించారు. పాకిస్థాన్‌లో జరగబోయే ఇరాన్-అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆ దేశాల మంత్రులు పూర్తి మద్దతు ఇచ్చినట్లు ఇషాక్ దార్ ప్రకటించారు. ఇరాన్, అమెరికాతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందించింది.

# లాకర్ల వస్తువులను బ్యాంకులు చూడవు: నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

వయ్యారి చిత్రం






## విశ్వంభర నుంచి రెండు అప్‌డేట్స్?

మెగాస్టార్ చిరంజీవి – మల్లాడి వశిష్ట కాంబినేషన్‌లో చాలా రోజుల క్రితం 'విశ్వంబర' చిత్రం ప్రారంభమైంది. ఈ సినిమాను మొదటగా 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన చాలా పనులు పెండింగ్‌లో ఉండటంతో విడుదలను వాయిదా వేశారు. ఆ తర్వాత ఈ వేసవిలో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు స్వయంగా చిరంజీవి ప్రకటించారు. కానీ ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ చిత్రం ఈ సమ్మర్‌లో కూడా వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అయితే, తాజాగా ఈ మూవీ యూనిట్ స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఒకేసారి రెండు అప్డేట్లతో అభిమానులను ఆనందపర్చే ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చాలా ఫుటేజ్ మూవీ యూనిట్ చేతికి వచ్చినట్లు సమాచారం. దాంతో ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీతో పాటు రిలీజ్ డేట్‌ను ఒకేసారి అనౌన్స్ చేయాలనే ఉద్దేశంలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

## మానసికంగా కుంగిపోయా



తెలుగు వెండితెరపై క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి హేమ గురించి తెలియని వారుండరు. ఎప్పుడూ నవ్వుతూ, ధైర్యంగా మాట్లాడే ఆమె, ఇటీవల ఎదుర్కొన్న డ్రగ్స్ కేసు వివాదంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తను అనుభవించిన నరకం, కుటుంబం పడ్డ ఇబ్బందుల గురించి తాజాగా హైదరాబాద్‌లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆమె భావోద్వేగంగా స్పందించారు. తనపై వచ్చిన నిందలు, నిర్దోషిగా బయటపడటం వెనుక ఉన్న అసలు నిజాలను ఆమె పంచుకున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో జరిగిన ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న హేమ, డ్రగ్స్ కేసు సమయంలో తనపై వచ్చిన ఆరోపణల గురించి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో తను ఎదుర్కొన్న అవమానాలు భరించలేక, ఒకానొక దశలో చచ్చిపోవాలనిపించింది అని ఆమె కంటతడి పెట్టారు. ఇక సమాజంలో పేరున్న ఒక మహిళగా, అలాంటి దారుణమైన ముద్ర తనపై పడటాన్ని అస్సలు జీర్ణించుకోలేకపోయానని, మానసికంగా పూర్తిగా కుంగిపోయానని ఆమె తన మనసులోని బాధను వెళ్లగక్కారు.



## రుక్కు డార్లింగ్.. 5 ఏళ్లలో 10 కోట్లు

కన్నడ చిత్రపరిశ్రమ నుంచి వచ్చి ఇప్పుడు దక్షిణాది మొత్తం తన నటనతో మాయ చేస్తున్న నటి రుక్మిణి వసంత్. -సప్త సాగరదాచే ఎల్లో- చిత్రంతో యువత ఆరాధ్య దేవతగా మారిన ఈ బ్యూటీ ఇప్పుడు పాన్-ఇండియా రేంజ్ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కేవలం వెండితెరపైనే కాకుండా.. తన వ్యక్తిత్వంతోనూ అందరినీ ఆకర్షిస్తున్న రుక్మిణి వసంత్ కెరీర్ కి కాంతార ఆఫర్ ఒక కీలక మలుపు. నటి రుక్మిణి వసంత్ నేపథ్యం చాలా గర్వించదగ్గది. తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్ భారత సైన్యంలో పని చేస్తూ 2007లో ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందారు. ఆయన సేవలకు గాను భారత ప్రభుత్వం అత్యున్నత అశోక చక్ర అవార్డును అందించింది. అటువంటి సైనిక కుటుంబం నుంచి వచ్చిన రుక్మిణి తన తండ్రి నుంచి క్రమశిక్షణను, తల్లి (సుభాషిణి వసంత్) నుంచి కళల పట్ల మక్కువను పుణికిపుచ్చుకుంది. ఈ క్రమశిక్షణే ఆమెను ఇండస్ట్రీలో అతి తక్కువ కాలంలోనే ఒక నిలకడైన నటిగా నిలబెట్టింది. ప్రస్తుతం రుక్మిణి వసంత్ నెట్ వర్త్ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని అంచనా. ఒకప్పుడు చిన్న సినిమాలతో మొదలైన ఈ నటి ప్రయాణం ఇప్పుడు భారీ ప్రాజెక్టుల వరకు చేరింది. -సప్త సాగరదాచే ఎల్లో- సాధించిన విజయం తర్వాత కాంతార చిత్రంతో మరో భారీ పాన్ ఇండియా విజయం తన స్థాయిని అమాంతం పెంచేసింది. ఇటీవల రుక్మిణి తన పారితోషికాన్ని భారీగా పెంచింది. ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ.3 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం సినిమాలే కాకుండా..బెంగళూరులో ఉన్న వారి కుటుంబ ఆస్తులు.. బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా 2026 చివరి నాటికి రుక్మిణి సంపద 10 కోట్లకు చేరుతుందని అంచనా.

## ఆడపులిగా మారాను: కియారా




స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ మాతృత్వంతో తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తల్లి కావడం అనేది తన జీవితాన్ని 360 డిగ్రీలు మార్చేసిందని.. ఇప్పుడు ప్రపంచాన్ని చూసే కోణమే పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. గత ఏడాది -గేమ్ ఛేంజర్- వంటి భారీ చిత్రంతో అలరించిన కియారా.. తొందర్లోనే టాక్సిక్ లాంటి భారీ పాన్ ఇండియన్ సినిమాతో మరోసారి అభిమానుల ముందుకు వస్తున్నారు. ఇటీవల కియరాకు ఒక బిడ్డ జన్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోని మధుర క్షణాలను ఆస్వాధిస్తూనే తన వృత్తిపరమైన బాధ్యతలను సమన్వయం చేసుకుంటున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తనలో రక్షణ భావం విపరీతంగా పెరిగిందని కియారా వెల్లడించారు. ఈ క్రమంలోనే తాను ఒక ఆడపులిలా మారిపోయానని ఆమె వ్యాఖ్యానించారు. తన బిడ్డ విషయంలో అత్యంత జాగ్రత్తగా.. బాధ్యతగా ఉ ంటున్నానని.. గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రాధాన్యతలు కూడా మారిపోయాయని తెలిపారు. ఒక్కోసారి ప్రపంచంలో ఏదీ ముఖ్యం కాదనిపిస్తుందని.. మరికొన్ని సార్లు తన బిడ్డ కోసం ప్రతిదీ ముఖ్యమే అన్న భావన కలుగుతుందని తన అంతరంగాన్ని ఆవిష్కరించారు.

## హనీ రోజ్‌తో అసభ్య ప్రవర్తన



సినిమా తారలు కనిపిస్తే చాలు ఒక సెల్ఫీ దిగాలని, కనీసం ఒక్కసారైనా వారిని తాకాలని అభిమానులు ఆరాటపడుతుంటారు. అయితే ఈ అభిమానం కొన్నిసార్లు హద్దులు దాటి హీరోయిన్లకు చేదు అనుభవంగా మారుతోంది. తాజాగా 'వీరసింహారెడ్డి' ఫేమ్ హనీ రోజ్ ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ఆకతాయిల వల్ల తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సెల్ఫీల వంకతో ఆమెను అసభ్యంగా తాకుతూ కొందరు ప్రవర్తించాడో ఆకతాయి. కేరళలోని కోజికోడ్‌లో ఒక ప్రముఖ జ్యువెలరీ షాపును ప్రారంభించడానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఆమెను చూడటానికి జనం భారీగా తరలిరావడంతో అక్కడ విపరీతమైన తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొందరు ఆకతాయిలు హనీ రోజ్‌తో సెల్ఫీలు తీసుకునే వంకతో ఆమెకు అతి సమీపంలోకి వచ్చి అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె నడుముపై, చేతులతో తాకుతూ ఇబ్బంది పెట్టడంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జనం మధ్యలో ఉ ండటంతో ఆమె ఏమీ అనలేక సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్ళిపోయారు.



## ఓటములే అసలు గురువు

సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన ప్రతి నటికీ సక్సెస్ అనేది ఓ కల. వైఫల్యాలను స్వీకరించి వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడం అనేది అంతకు మించిన మరో గొప్ప కళ. బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. తనకు ఎదురైన ప్రతి పరాజయాన్ని ఒక అపజయంగా కాకుండా తనను తాను మెరుగుపరుచుకునే ఒక ఉత్తమ గురువుగా భావిస్తూ ముందుకు సాగుతోంది. నటనలోనే కాకుండా కథల ఎంపికలో కూడా వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు కెరీర్ ఎదుగుదలకు ఎంతో దోహదం చేసాయని చెప్పింది. పరాజయాలు ఎదురైనప్పుడు కెరీర్ పట్ల మరింత కఠినంగా నిర్ణయాత్మకంగా వ్యవహరించడం తన శైలి అని చెప్పుకొచ్చింది. తనను తాను నమ్ముకుని ప్రతి వైఫల్యాన్ని ఒక మెట్టుగా మలుచుకున్నానని పేర్కొంది.










# బుడ్డోడు దంచేశాడు!

## సూర్యవంశీ వీరబాదుడు.. సీఎస్కేపై రాజస్థాన్ ఘనవిజయం

**ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యవంశీ ఆడిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.**

**ఛేజింగ్ లో రాజస్థాన్‌కు, చెన్నై బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టంగా అనిపించలేదు. ముఖ్యంగా ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. క్రీజులోకి వచ్చిన కాసేపటికే బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 17 బంతుల్లోనే 305.88 స్ట్రైక్ రేట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసి చెన్నై శిబిరాన్ని నిరాశకు గురిచేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 74 పరుగులకు చేరిందంటే వైభవ్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.**

తొలి వికెట్‌కు యశస్వి జైస్వాల్‌తో కలిసి కేవలం 38 బంతుల్లోనే 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. సూర్యవంశీ ఔటైన తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (18; 9 బంతుల్లో) కూడా వేగంగా ఆడాడు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ (38 నాటౌట్; 36 బంతుల్లో) నిలకడగా ఆడి, కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. అంతకుముందు, రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడకుండా 19.4 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. సంజూ శాంసన్ (6), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6) సహా టాపార్డర్ పూర్తిగా విఫలమైంది. ఒక దశలో 57 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నండ్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు పడగొట్టి చెన్నై పతనాన్ని శాసించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాజస్థాన్ ఈ సీజన్‌లో తమ జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది.




### 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

ఐపీఎల్ 2026 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ సిక్సర పిడుగు, టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ఘనంగా ప్రారంభించాడు. తొలి మ్యాచ్‌లోనే తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదాడు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న కండిషన్స్‌లోనూ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ సీజన్‌లో ఫస్ట్ మ్యాచ్ ఆడుతున్నామనే బెరుకు కూడా లేకుండా తొలి బంతి నుంచే హిట్టింగ్ మొదలు పెట్టాడు. అదృష్టవశాత్తు తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న వైభవ్ సూర్యవంశీ.. రెండో బంతినే సిక్సర్ తరలించాడు. మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో అతను ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను కార్తీక్ శర్మ వదిలేయడంతో పాటు బౌండరీ ఆపలేకపోయాడు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న బుడ్డోడు మరుసటి బంతినే డీప్ మిడ్ వికెట్ దిశగా సిక్సర్ బాదాడు. నూర్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాది 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 13 బంతుల్లో హాఫ్ సెంచరీతో యశస్వి జైస్వాల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. రెండు, మూడు స్థానాల్లో వైభవ్ ఉన్నాడు. గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌పై వైభవ్ 17 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదాడు. సీఎస్‌కే బ్యాటర్లు తడబడిన వికెట్‌పై వైభవ్ సూర్యవంశీ అలవోకగా సిక్సర్లు బాదాడు. మొత్తం 5 సిక్సర్లతో మ్యాచ్‌ను చెన్నై నుంచి లాగేసుకున్నాడు. అన్షుల్ కంబోజ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన వైభవ్ సూర్యవంశీ(17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు.

**రూ.14 కోట్ల ఆటగాడు ఫ్లాప్**

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు రూ.14.2 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన యువ సంచలనం కార్తీక్ శర్మ, ఐపీఎల్ 2026 అరంగేట్రంలోనే తీవ్రంగా నిరాశపరిచాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కీలక సమయంలో బ్యాటింగ్‌కు వచ్చి, 15 బంతుల్లో 18 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు.

## రాజస్థాన్‌కు ట్రోఫీ గెలవడమే లక్ష్యం: వైభవ్

రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్, టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 సీజన్‌పై తన లక్ష్యాన్ని స్పష్టం చేశాడు. 2008లో తొలి సీజన్‌లో విజేతగా నిలిచిన తర్వాత మళ్లీ ట్రోఫీకి దూరమైన తమ జట్టుకు ఈసారి ఎలాగైనా కప్ అందించడమే తన ప్రధాన ధ్యేయమని అన్నాడు. ఇటీవల ముగిసిన అండర్-19 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచిన వైభవ్, అదే ఉత్సాహంతో ఐపీఎల్‌లో రాణించాలని చూస్తున్నాడు. ఓ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైభవ్ మాట్లాడుతూ, "ఈ సీజన్‌లో జట్టు కోసం ట్రోఫీ గెలవడమే నా లక్ష్యం. మేము ట్రోఫీ గెలిస్తే నా ప్రదర్శన, జట్టు ప్రదర్శన వాటంతట అవే హైలైట్ అవుతాయి. అదే అత్యంత ముఖ్యం" అని తెలిపాడు. గత ఐపీఎల్ 2025 సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి 252 పరుగులు చేసిన వైభవ్, అందులో ఒక ఇన్నింగ్స్ లో 35 బంతుల్లోనే సెంచరీ బాదడం విశేషం. "పవర్‌ప్లేలో దూకుడుగా ఆడి జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాలనుకుంటున్నా. ఒకసారి కుదురుకుంటే వికెట్ చేజార్చుకోకుండా సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడతాను" అని వివరించాడు. తన చిన్ననాటి హీరోలు బ్రియాన్ లారా, యువరాజ్ సింగ్ తనపై ఎంతో ప్రభావం చూపారని వైభవ్ గుర్తుచేసుకున్నాడు. "లారా, యువరాజ్ ఒంటిచేత్తో మ్యాచ్‌లను ముగించడం చూశాను. వారు క్రీజులో ఉంటే ప్రత్యర్థికి గెలిచే అవకాశం ఉండేది కాదు. వారిలోని ఆ లక్షణం నాకు బాగా నచ్చింది" అని చెప్పాడు. బీహార్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో రాణించడం ద్వారా అండర్-19 జట్టుకు, ఆ తర్వాత రంజీ ట్రోఫీకి ఎంపికయ్యానని, అప్పటి నుంచే రాజస్థాన్ రాయల్స్ స్కౌటింగ్ బృందం తనను గమనిస్తోందని వైభవ్ పేర్కొన్నాడు.



## ధోనీ, జడ్డూ, రైనా లేకుండా తొలిసారి!

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో గౌహతి వేదికగా జరిగిన తమ తొలి మ్యాచ్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఐపీఎల్ చరిత్రలోనే మహేంద్ర సింగ్ ధోనీ, సురేష్ రైనా, రవీంద్ర జడేజాల్లో కనీసం ఒక్కరు లేకుండా చెన్నై సూపర్ కింగ్స్ బరిలోకి దిగడం ఇదే తొలిసారి. ధోనీ, రైనా ఆరంభం నుంచి సీఎస్‌కేతో ఉండగా.. జడేజా కాస్త ఆలస్యంగా జట్టులోకి వచ్చాడు. అయినా సీఎస్‌కే ఐకాన్‌గా ఎదిగాడు. ఈ త్రయం చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐపీఎల్ చరిత్రలోనే అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలబెట్టింది. ధోనీ సారథ్యంలో సీఎస్‌కేను 10 సార్లు ఫైనల్ చేరడంతో పాటు 12 సార్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. అతని సారథ్యంలో ఐదు టైటిళ్లను గెలిచింది. వికెట్ కీపర్‌గా 200 వికెట్లలో భాగమైన ధోనీ.. బ్యాటర్‌గా 5000 ప్లస్ రన్స్ చేశాడు. 'తల'గా ధోనీకి ప్రత్యేక అభిమాన గణం ఉంది. చిన్న తల సురేష్ రైనా ఐపీఎల్‌లో 5000 పరుగుల మైలురాయి అందుకున్న తొలి ఆటగాడు. మరోవైపు రవీంద్ర జడేజా.. ఐపీఎల్‌లో 100 పరుగులు, 100 వికెట్లతో పాటు 100 క్యాచ్‌లు అందుకున్న తొలి ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. ఐపీఎల్ 2023 సీజన్ ఫైనల్లో బౌండరీతో విజయలాంఛనం పూర్తి చేయడం సీఎస్‌కే చరిత్రలోనే చిరస్మరణీయంగా మిగిలింది. అలాంటి త్రయంలో ఒక్కరు లేకుండానే చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ ప్రారంభించింది. సురేష్ రైనా 2022 సెప్టెంబర్‌లో ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలానికి ముందు ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా రవీంద్ర జడేజా.. రాజస్థాన్ రాయల్స్‌కు వెళ్లిపోయాడు. అతనికి బదులుగా సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చాడు. మహేంద్ర సింగ్ ధోనీ జట్టులోనే కొనసాగుతున్నా.. గాయంతో ఈ సీజన్ తొలి రెండు వారాలు టీమ్‌కు దూరమయ్యాడు. దాంతో ఐకాన్ ప్లేయర్లు లేకుండా చెన్నై బరిలోకి దిగాల్సి వచ్చింది. ఇలా ధోనీ, రైనా, జడేజాల్లో ఒక్కరు కూడా లేకుండా చెన్నై సూపర్ కింగ్స్ బరిలోకి దిగడం తమ 17 ఏళ్ల ప్రస్థానంలో ఇదే తొలిసారి.

## గర్ల్‌ఫ్రెండ్‌కు హార్దిక్ ఖరీదైన కానుక

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తన ప్రేయసి మహికా శర్మపై ప్రేమను వినూత్నంగా చాటుకున్నాడు. తన ఆన్-ఫీల్డ్ విజయాల వెనుక ఆమె ప్రోత్సాహం ఉందని పలు సందర్భాల్లో చెప్పిన పాండ్యా, ఇప్పుడు ఆమెకు ఒక ఖరీదైన బహుమతి ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. సుమారు రూ. 1.7 కోట్ల విలువైన మెర్సిడెస్-బెంజ్ వి-క్లాస్ లగ్జరీ కారును మహికాకు బహుమతిగా ఇచ్చాడు. విశేషమేమిటంటే ఈ మోడల్ కారును ఇండియాలో అందుకున్న మొట్టమొదటి వ్యక్తి మహికానే కావడం. కొద్ది వారాల క్రితమే హార్దిక్ పాండ్యా రూ. 12 కోట్ల విలువైన అల్ట్రా-లగ్జరీ ఫెరారీ కారును కొనుగోలు చేశాడు. ఇప్పుడు తన ప్రేయసి కోసం కొత్తగా విడుదలైన ఈ ప్రీమియం వాహనాన్ని బహుమతిగా అందించాడు. అత్యంత విశాలంగా, ఆధునికంగా ఉండే ఈ కారుతో హార్దిక్, మహికా కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయ్యాయి. ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక క్రికెట్ విషయానికొస్తే, ఐపీఎల్ 2026 సీజన్‌లో హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్ శుభారంభం చేసింది.



## నాలా ఫిట్‌గా ఉండాలి బ్రో!

### రహానేను టీజ్ చేసిన రోహిత్

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే కండరాలు పట్టేయడంతో(క్రాంప్స్) మ్యాచ్ మధ్యలోనే మైదానం వీడాడు. అతను బయటకు వెళ్తుండుగా రోహిత్ శర్మ టీజ్ చేశాడు. డ్యాన్స్ చేస్తూ మరీ ఆట పట్టించాడు. 'నాలా ఫిట్‌గా ఉండాలి బ్రో.. లేకుంటే ఇలానే కండరాలు పట్టేస్తాయి'అని రహానేతో రోహిత్ అన్నట్లు కనిపించింది. రోహిత్ మాటలకు రహానే నవ్వుతూ ముందుకు సాగాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రోహిత్, రహానేలు మంచి స్నేహితులన్న సంగతి తెలిసిందే. ఇద్దరూ దేశవాళీ క్రికెట్‌లో ముంబైకి ఆడేవారు. వారి మధ్య ఎన్నో సాన్నిహిత్యం ఉంది. ఆ చనువుతోనే రహానేను రోహిత్ ఆట పట్టించాడు. ఇక రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టి 10 కిలోల బరువు తగ్గిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతను కరెంట్ తీగలాగా సన్నగా మారిపోయాడు. ఈ సీజన్‌ను రోహిత్ శర్మ ఘనంగా ప్రారంభించాడు. విధ్వంసకర (38 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 78) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. మరో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(43 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 81)తో కలిసి తొలి వికెట్‌కు 148 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించాడు. దాంతో ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 14 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్‌లో బోణీ కొట్టింది.

## గ్రీన్‌పై రాయుడు సెటైర్లు

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. గ్రీన్ కవర్ డ్రైవ్ ఆడితే మోచేయి విరుగుతుందా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న గ్రీన్.. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఆల్‌రౌండర్ అయిన గ్రీన్ బౌలింగ్ చేయకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ మ్యాచ్‌లో పేలవ బౌలింగ్‌తో కేకేఆర్ 221 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. మ్యాచ్ అనంతరం గ్రీన్ బౌలింగ్ చేయకపోవడంపై అజింక్యా రహానేను హోస్ట్ ప్రశ్నించగా.. క్రికెట్ ఆస్ట్రేలియాను అడగాలని బదులిచ్చాడు. అతను బౌలింగ్ చేయకుండా క్రికెట్ ఆస్ట్రేలియా అడ్డుకుంటుందని పరోక్షంగా చెప్పాడు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఐపీఎల్ 2026 మినీ వేలంలో కామెరూన్ గ్రీన్‌ను కేకేఆర్ రూ.25.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది.

నేటి ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 31-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# ఎర్ర చీకటిపై వెలుగు రేఖ

దశాబ్దాల కాలంగా దేశ అంతర్గత భద్రతకు సవాలుగా మారిన నక్సలిజం అంచులకు చేరుకుంది. మార్చి 31, 2026 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డెడ్‌లైన్ నేటితో ముగియనుంది. ఈ రెండేళ్ల కాలంలో ఆపరేషన్ కగార్ ద్వారా భద్రతా దళాలు సాధించిన పురోగతి భారత భద్రతా చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలుస్తుంది. గత పదేళ్లలో నక్సల్ ప్రాభవం 90% పైగా తగ్గింది. ఒకప్పుడు వేల సంఖ్యలో ఉన్న మావోయిస్టు కేడర్ ఇప్పుడు కేవలం కొన్ని వందలకు పరిమితమైంది. క్షేత్రస్థాయి కార్యకర్తలే కాకుండా, పార్టీకి దిశానిర్దేశం చేసే అగ్రశ్రేణి నాయకులు, పొలిట్‌బ్యూరో సభ్యులు కూడా లొంగిపోవడం ఈ ఆపరేషన్ సాధించిన పెద్ద విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మాడ్, బస్తర్ వంటి దుర్భేద్యమైన అడవుల్లో భద్రతా దళాలు జరిపిన మెరుపు దాడులు మావోయిస్టుల వెన్నులో వణుకు పుట్టించాయి. కేంద్ర ప్రభుత్వం కేవలం సైనిక చర్యలకే పరిమితం కాకుండా, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడం ద్వారా విజయాన్ని సుస్థిరం చేసింది. నక్సల్స్ ఒకప్పుడు అడ్డుకున్న రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణం ఇప్పుడు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయి. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసే వారికి తక్షణ ఆర్థిక సహాయం (రూ. 1.5 లక్షలు), నెలవారీ ఉపకార వేతనాలను అందించడం ద్వారా వేల మందిని లొంగుబాటు వైపు మళ్లించగలిగారు. నక్సలిజం రహిత భారత్ అనే లక్ష్యం కేవలం నినాదం కాదని, పటిష్టమైన కార్యాచరణతో సాధ్యమవుతుందని ఆపరేషన్ కగార్ నిరూపించింది. బస్తర్ అడవుల నుంచి పశుపతినాథ్ వరకు ఎర్ర నీడలు తొలగి, అభివృద్ధి కిరణాలు ప్రసరిస్తున్న వేళ, ఇది శాంతి వైపు దేశం వేసిన అతిపెద్ద అడుగు. అయితే, ఈ విజయం కేవలం ఆయుధాల నిర్మూలనతోనే ఆగకూడదు; అడవి బిడ్డల హక్కులను కాపాడుతూ, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేసినప్పుడే ఈ శాంతి శాశ్వతమవుతుంది.



**చట్టసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలు. ప్రజలు తమ సమస్యల ను పరిష్కరించుకోవాలనే ఆశతో ఎన్నుకునే ప్రతినిధులు ఈ చట్టసభల్లో కూర్చొని ప్రజల తరపున మాట్లాడాలి, చట్టాలు చేయాలి, ప్రభుత్వాన్ని ప్రశ్నిం చాలి, బాధ్యతాయుత పాలనకు దారితీయాలి. అయితే వాస్తవ పరిస్థితులను పరిశీలించినప్పుడు చట్టసభలు తమ అసలు లక్ష్యాన్ని ఎంతవరకు నెరవేర్చు తున్నాయి అన్న ప్రశ్నకు సమగ్ర సమాధానం ఇవ్వడం అవసరం అవుతోంది.**

# చట్టసభలు- ప్రజా సమస్యలు



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

భారతదేశంలో చట్టసభల పనితీరుపై వివిధ అధ్యయనాలు, నివేదికలు ఒక ముఖ్యమైన వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. 1952లో మొదటి లోక్‌సభ ఏర్పడిన తర్వాత ప్రారంభ దశలో సభలు సగటున 120 – 130 రోజులు సమావేశమయ్యేవి. కానీ 2000ల తర్వాత ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. 2019 తర్వాత కాలంలో లోక్‌సభ సగటు సమావేశ దినాలు 60 – 70 మధ్యకే పరిమితమవుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది దాదాపు 40% వరకు తగ్గుదలగా చెప్పవచ్చు. సమావేశాల సంఖ్య తగ్గడం అంటే ప్రజా సమస్యలపై చర్చించే అవకాశాలు కూడా తగ్గుతున్నాయి అన్నది స్పష్టమైన విషయం. అదే విధంగా చట్టసభల్లో పని సమయ వినియోగం కూడా ఆందోళనకరంగా మారింది.

కొన్ని అధ్యయనాల ప్రకారం, కొన్ని సమావేశాల్లో మొత్తం సమయం లో 30% వరకు మాత్రమే అసలు చర్చలకు వినియోగించబడగా మిగతా 70% సమయం అల్లర్లు, వాయిదాలు, నినాదాల వల్ల వృథా అయిన సందర్భాలు నమోదయ్యాయి. ఇది ప్రజల పన్నుల రూపంలో వచ్చే ధనానికి నేరుగా నష్టం. ఒక రోజు పార్లమెంట్ సమావేశం నిర్వహణకు సుమారు □2 కోట్లు వరకు ఖర్చవుతుందని అంచనా. ఆ దృష్ట్యా ఒక సమావేశం వృథా అయితే కోట్ల రూపాయల ప్రజా ధనం నిరుపయోగంగా పోతుంది. చట్టసభలలో చర్చల నాణ్యత విషయంలో కూడా స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. 1960 – 1980 మధ్య కాలంలో చట్టసభ చర్చలు ఎక్కువగా విధానాలపై, ఆర్థిక అంశాలపై, సామాజిక సంస్కరణలపై కేంద్రీకృతమయ్యేవి. కానీ 2000 తర్వాత రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు పెరిగినట్లు పరిశీలనలు సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రశ్నోత్తర సమయం పూర్తిగా నిలిచిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు 2010లలో కొన్ని సమావేశాల్లో ప్రశ్నోత్తర సమయం 50% వరకు కూడా ఉపయోగించబడకుండా పోయింది.

ప్రజా సమస్యల అమలు విషయంలో పరిస్థితి ఇంకా క్లిష్టంగా ఉంది. చట్టసభల్లో చర్చకు వచ్చిన అంశాలు కార్యరూపం దాల్చడంలో పెద్ద గ్యాప్ కనిపిస్తోంది. వివిధ కమిటీ నివేదికల ప్రకారం చట్టసభల్లో లేవనెత్తిన సమస్యల్లో సుమారు 20% – 30% మాత్రమే పూర్తి స్థాయిలో అమలు దశకు చేరుకుంటున్నాయి. మిగతా అంశాలు ఫైళ్లలోనే నిలిచిపోతున్నాయి లేదా అమలు ఆలస్యం అవుతున్నాయి. ఇది ప్రజలలో తీవ్ర నిరాశకు కారణమవుతోంది. వ్యవసాయ రంగాన్ని ఉదాహరణగా తీసుకుంటే రైతుల సమస్యలు దాదాపు ప్రతి సమావేశంలో ప్రస్తావనకు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ రైతుల ఆదాయం పెంపు, కనీస మద్దతు ధర, సాగునీటి సమస్యలు వంటి అంశాలు పూర్తిగా పరిష్కారం కాలేదు. అదే విధంగా నిరుద్యోగం అంశం కూడా నిరంతరం చర్చకు వస్తున్నప్పటికీ యువతకు ఉపాధి అవకాశాలు తగిన స్థాయిలో పెరగలేదు.

**2022 – 2024 మధ్య కాలంలో నిరుద్యోగ రేటు 6% – 8% మధ్య ఊగిసలాడినట్లు వివిధ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది చర్చలున్నప్పటికీ ఫలితాలు పరిమితంగానే ఉన్నాయని సూచిస్తుంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటి పార్టీ రాజకీయాల అధిక ప్రాధాన్యం. అనేక సందర్భాల్లో సభ్యులు తమ పార్టీ స్థానం రక్షించడానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలపై సమగ్ర చర్చలు జరగాల్సిన చోట రాజకీయ వాదోపవాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీని వల్ల చట్టసభలు సమన్వయ వేదికలుగా కాకుండా ఘర్షణ వేదికలుగా మారుతున్నాయి.**

మరో ముఖ్యమైన అంశం సభ్యుల సిద్ధత లోపం. కొన్ని అధ్యయనాల ప్రకారం చట్టసభ సభ్యుల్లో గణనీయమైన శాతం మంది చర్చకు ముందు సంబంధిత అంశంపై పూర్తి స్థాయి అధ్యయనం చేయడం లేదని తెలుస్తోంది. ఇది చర్చల నాణ్యతను ప్రభావితం చేస్తోంది. గణాంకాలు, డేటా, పరిశోధన ఆధారంగా మాట్లాడాల్సిన చోట సాధారణ వ్యాఖ్యలు మాత్రమే వినిపిస్తున్నాయి. సమయ నిర్వహణ లోపం కూడా కీలక సమస్య. ముఖ్యమైన బిల్లులు కొన్ని సందర్భాల్లో చర్చ లేకుండా ఆమోదించబడుతున్నాయి. 2020 తర్వాత కాలంలో కొన్ని బిల్లులు 1 – 2 గంటల చర్చలోనే ఆమోదించబడిన ఉదాహరణలు ఉన్నాయి. ఇది చట్టసభల గంభీరతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. చట్టసభల పనితీరు బలహీనపడటం ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని భావించినప్పుడు రాజకీయ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. కొన్ని సర్వేలు సూచించినట్లుగా 40% కంటే ఎక్కువ మంది ప్రజలు తమ సమస్యలు చట్టసభల్లో సరైన రీతిలో ప్రస్తావించబడడం లేదని భావిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ఒక హెచ్చరిక సంకేతం. ఈ పరిస్థితిని మార్చడానికి కఠిన చర్యలు అవసరం. మొదటగా చట్టసభల పని దినాలను కనీసం 100 రోజులకు పెంచాల్సిన అవసరం ఉంది. రెండవది పని సమయ వినియోగాన్ని కనీసం 80% వరకు పెంచే విధంగా క్రమశిక్షణ అమలు చేయాలి. మూడవది చర్చల తర్వాత అమలు పురోగతిని ట్రాక్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలి. నాలుగవది సభ్యులకు శిక్షణ, పరిశోధన సహాయం అందించాలి.

మొత్తానికి చట్టసభలు ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత శక్తివంతమైన వేదికలు అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అవి ఆ పాత్రను పూర్తిగా నిర్వర్తించడం లేదనే విమర్శలు గణాంకాల ద్వారా కూడా స్పష్టమవుతున్నాయి. సమావేశాల సంఖ్య తగ్గడం, పని సమయం వృథా అవడం, అమలు శాతం తక్కువగా ఉండటం – ఈ మూడు అంశాలు చట్టసభల విశ్వసనీయతను ప్రభావితం చేస్తున్నాయి.

అందువల్ల చట్టసభలను మళ్లీ ప్రజల సమస్యల కేంద్రంగా మార్చాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది. చర్చలు ఫలితాల దిశగా సాగాలి. నిర్ణయాలు కార్యరూపం దాల్చాలి. ప్రజల ధనం, సమయం విలువైనవి అనే భావన ప్రతి సభ్యుడిలో పెరగాలి. అప్పుడు మాత్రమే చట్టసభలు నిజమైన ప్రజాస్వామ్య వేదికలుగా నిలుస్తాయి. లేదంటే అవి కేవలం రాజకీయ ఆరోపణల రంగస్థలాలుగా మిగిలిపోతాయి అనే ఆందోళన వాస్తవంగా మారుతుంది. ముగింపుగా చెప్పుకోవాల్సిన విషయమేమిటంటే చట్టసభల ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదు, తగ్గకూడదు కూడా. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల స్వరానికి ప్రతిధ్వని కలిగించే ప్రధాన వేదిక చట్టసభలే. అయితే ఆ వేదిక తన అసలు ఉద్దేశ్యాన్ని కోల్పోతే ప్రజాస్వామ్యం కేవలం ఒక ప్రక్రియగా మిగిలిపోతుంది గానీ జీవంతమైన వ్యవస్థగా నిలబడదు. అందుకే చట్టసభల పనితీరుపై విమర్శలు రావడం ఒక ప్రతికూల సంకేతం అయినప్పటికీ అదే సమయంలో అది ఒక సవరణకు అవకాశం కూడా. సమస్యను గుర్తించడం మొదటి అడుగు అయితే దానిని సరిదిద్దడం అసలు బాధ్యత.

**ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి ఒక యాదృచ్ఛికం కాదు. వారు చూస్తున్నారు – సభలు ఎలా నడుస్తున్నాయి, వారి ప్రతినిధులు ఎలా మాట్లాడుతున్నారు, ఎలాంటి అంశాలు ప్రాధాన్యం పొందుతున్నాయి అన్నది. మీడియా విస్తరణ, డిజిటల్ ప్లాట్‌ఫార్ముల అభివృద్ధి వల్ల ప్రతి చర్చ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ పారదర్శకత ఒక వైపు ప్రజలకు అవగాహన పెంచితే మరో వైపు ప్రజాప్రతినిధులపై బాధ్యతను మరింత పెంచింది. అయినప్పటికీ ఆ బాధ్యతను ప్రతి సందర్భంలో సమర్థంగా నిర్వర్తిస్తున్నామా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.**

చట్టసభల్లో చర్చలు కేవలం మాటల మార్పిడి కాకూడదు. అవి విధాన రూపకల్పనకు దారితీయాలి. ఒక సమస్యను లేవనెత్తడం మొదటి దశ మాత్రమే. దాని వెనుక డేటా ఉండాలి, విశ్లేషణ ఉండాలి, ప్రత్యామ్నాయ సూచనలు ఉండాలి, చివరికి అమలు పథకం ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియలో లోపం ఉన్నప్పుడు చర్చలు ఎంత జరిగినా ఫలితం ఉండదు. అందువల్ల చట్టసభ సభ్యులు తమ పాత్రను మరింత ప్రొఫెషనల్ దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ ఒక బాధ్యత, ఒక నైపుణ్యం, ఒక కట్టుబాటు అని భావించినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. ఇక రాజకీయ సంస్కృతి విషయంలో కూడా ఒక పెద్ద మార్పు అవసరం. విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజం. కానీ అవి వ్యక్తిగత స్థాయికి దిగజారకూడదు. వాదోపవాదాలు అంశాలపైనే ఉండాలి గానీ వ్యక్తులపై కాకూడదు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ద్వారా తాత్కాలిక రాజకీయ లాభాలు దక్కవచ్చు కానీ దీర్ఘకాలంలో అది వ్యవస్థపైనే నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. చట్టసభల గౌరవం కాపాడడం ప్రతి సభ్యుడి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉంది. మరో కీలక అంశం అమలు వ్యవస్థ. చట్టసభల్లో చర్చించిన ప్రతి అంశం అమలుకు వెళ్లకపోయినా కనీసం ప్రాధాన్యమైన సమస్యలు కార్యరూపం దాల్చాలి. దీనికోసం బలమైన మానిటరింగ్ వ్యవస్థ అవసరం. కమిటీలు మరింత చురుకుగా పనిచేయాలి. సమయానుకూలంగా నివేదికలు ఇవ్వాలి. ప్రభుత్వ శాఖలు ఆ నివేదికలపై చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉంటేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. లేకపోతే చర్చలు కేవలం రికార్డులకే పరిమితం అవుతాయి.

ప్రజల పాత్రను కూడా ఇక్కడ విస్మరించలేం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేసే హక్కుతో ముగియదు. అది ఒక నిరంతర ప్రక్రియ. ప్రజలు తమ ప్రతినిధులను ప్రశ్నించాలి, వారి పనితీరును అంచనా వేయాలి, అవసరమైతే విమర్శించాలి. సోషల్ మీడియా, పబ్లిక్ ఫోరమ్స్, సివిల్ సొసైటీ సంస్థలు ప్రజల స్వరాన్ని బలపరచగలవు. ప్రజల ఒత్తిడి పెరిగినప్పుడు రాజకీయ నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి వస్తుంది. ఇక యువత పాత్ర మరింత ప్రాముఖ్యంగా మారుతోంది. దేశ జనాభాలో గణనీయమైన శాతం యువతే.

వారి ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు చట్టసభల్లో ప్రతిబింబించాలి. కానీ అది జరగాలంటే యువత రాజకీయాలపై ఆసక్తి పెంచుకోవాలి. అవగాహన పెంచుకోవాలి. మంచి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. విమర్శాత్మక దృష్టితో వ్యవస్థను చూడాలి. అప్పుడు మాత్రమే భవిష్యత్తులో చట్టసభలు మరింత సమర్థవంతంగా మారే అవకాశం ఉంటుంది. టెక్నాలజీ వినియోగం కూడా చట్టసభల పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించగలదు. డిజిటల్ డేటా, రియల్ టైమ్ మానిటరింగ్, ప్రజల అభిప్రాయ సేకరణ వంటి అంశాలు చర్చలను మరింత ప్రామాణికంగా మార్చగలవు. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ఈ దిశగా ముందుకు సాగుతున్నాయి. భారతదేశంలో కూడా ఈ మార్పులు వేగవంతం కావాల్సిన అవసరం ఉంది. పారదర్శకత పెరిగితే బాధ్యత కూడా పెరుగుతుంది.

చట్టసభల పనితీరులో మెరుగుదల రావాలంటే రాజకీయ సంకల్పం అత్యంత ముఖ్యమైనది. నియమాలు ఉన్నా వాటిని అమలు చేయాలనే సంకల్పం లేకపోతే మార్పు సాధ్యం కాదు. అందుకే అన్ని పార్టీలూ కలిసి ఒక కనీస సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యల విషయంలో ఐక్యత ప్రదర్శించాలి. విభేదాలు ఉన్నా అవి ప్రజా ప్రయోజనాలకు అడ్డంకి కాకూడదు. ఇది ఒక పరిపక్వ ప్రజాస్వామ్య లక్షణం. మొత్తం మీద చూస్తే చట్టసభలు ఇప్పటికీ ప్రజల ఆశల కేంద్రంగా ఉన్నాయి. అవి పూర్తిగా విఫలమయ్యాయని చెప్పడం సరైంది కాదు. అనేక సందర్భాల్లో మంచి చర్చలు జరిగాయి, మంచి చట్టాలు వచ్చాయి, ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకున్నారు.

కానీ అదే సమయంలో లోపాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ లోపాలను సరిదిద్దకుండా వదిలేస్తే భవిష్యత్తులో సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందువల్ల ఈ దశలో ఒక సమగ్ర పునరాలోచన అవసరం. చట్టసభల పాత్ర ఏమిటి, అవి ఎలా పనిచేయాలి, ప్రజల అంచనాలు ఏమిటి అన్న అంశాలపై అన్ని వర్గాలు చర్చించాలి. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతను గుర్తించాలి. రాజకీయ పార్టీలు తమ ధోరణిని మార్చుకోవాలి. ప్రజలు తమ పాత్రను చురుకుగా నిర్వహించాలి.

**ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. చివరగా ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి – ప్రజాస్వామ్యం ఒక జీవంతమైన వ్యవస్థ. అది నిరంతరం మారుతూ ఉంటుంది. దాన్ని బలోపేతం చేయడం ప్రతి తరం బాధ్యత. చట్టసభలు ఆ వ్యవస్థకు గుండె లాంటివి. ఆ గుండె సక్రమంగా పనిచేస్తేనే దేశం ఆరోగ్యంగా ఉంటుంది. లేకపోతే సమస్యలు పెరుగుతాయి.**

అందుకే చట్టసభలను కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం అంటే ప్రజల భవిష్యత్తును కాపాడటమే. ఈ అవగాహన ప్రతి ఒక్కరిలో పెరిగినప్పుడే చట్టసభలు నిజమైన ప్రజా వేదికలుగా మారి తమ అసలు లక్ష్యాన్ని చేరుకుంటాయి.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.